News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :266 | ఖమ్మం | బుధవారం నవంబర్ 5, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయలేదేం?

- 'కాళేశ్వరం' కేసును మీరు కోరినట్టే సీబీఐకి అప్పగించాం
- ఇంకా కేసే నమోదు చేయలేదు
- కేసీఆర్‌కు లొంగకపోవడం నిజమైతే.. 11లోపు ఎఫ్ఐఆర్ నమోదు చేయండి
- కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతి కోరి 2 నెలలైనా స్పందన లేదని వెల్లడి



"భాజపా, భారత రాష్ట్ర సమితిల మధ్య చీకటి ఒప్పందం ఉంది. పగలు తిట్టుకుంటారు.. రాత్రి కలుసుకుంటారు" అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో సీఎం పాల్గొన్నారు. అనంతరం శ్రీరాంనగర్ పీజేఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రచారసభలో ప్రసంగించారు. "కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంగా మారిందని పలు సందర్భాల్లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అన్నారు. సీబీఐకి అప్పగిస్తే... 24 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. సెప్టెంబరు 1న అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి పంపితే.. ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కిషన్‌రెడ్డీ... భారత రాష్ట్ర సమితితో మీకు లాలూచీ లేకపోతే ఎందుకు అరెస్ట్ చేయలేదు? ఫార్ములా-ఈ రేస్‌లో రూ.50 కోట్ల ప్రజాధనం దోచిన కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు

వివరాలు 2లో..


## భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ..



ఏపీ అభివృద్ధికి కేంద్రంగా భోగాపురం విమానాశ్రయం నిలుస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం 91.7 శాతం పూర్తి అయిందని పేర్కొన్నారు. మంగళవారం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ పనులని రామ్మోహన నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు,

వివరాలు 2లో..

## భారత్ కు రష్యా చమురు పై ఫలిస్తున్న ట్రంప్ వ్యూహం..!



రష్యా చమురు కొనుగోలు చేస్తూ ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తున్నారనే కారణంతో భారత్ పై అమెరికా గతంలో 50 శాతం సుంకాలు విధించింది. అయినా భారత్ మిత్రదేశానికి అండగా నిలబడాలనే నిర్ణయించుకుంది. అదే సమయంలో జాతీయ ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకుని రష్యా చమురు కొనుగోళ్లు ఆపలేమని తేల్చిచెప్పేసింది. ఈ విషయంలో భారత్ రాజీ పడకపోవడంతో ట్రంప్ సర్కార్ సుంకాల తగ్గింపు విషయం లోనూ వెనక్కి తగ్గడం లేదు.

వివరాలు 2లో..



# ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్

## ఇక్కడి విద్యార్థులకు జర్మన్ నేర్పించండి

**పెట్టుబడులకు ప్రభుత్వం సహకరిస్తుంది**

సీఎంతో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందం భేటీ
రేవంత్‌ను కలిసిన అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులు

వివరాలు 2లో..

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం..

### ఏపీ మాజీ మంత్రి తమ్ముడిని గన్‌తో బెదిరించిన తెలంగాణ మాజీ ఎమ్మెల్యే తనయుడు!



- కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రభాకర్, నందీశ్వర్ గౌడ్ కుటుంబాల మధ్య గొడవ
- కేఈ ప్రభాకర్ కుమార్తెకు నందీశ్వర్ గౌడ్ కుమారుడితో 14 ఏళ్ల క్రితం పెళ్లి
- విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్న భార్యాభర్తలు
- ఒక ఫ్లాట్ విషయంలో ప్రభాకర్, అల్లుడు అభిషేక్ గౌడ్ మధ్య గొడవ

వివరాలు 2లో..

## బ్రేక్ వేయకపోవడంతోనే దారుణం?


**మీర్జాగూడ ప్రమాదంపై వివిధ శాఖల దర్యాప్తు**
**టిప్పర్ డ్రైవర్ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు**



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడలో సోమవారం జరిగిన దారుణ రోడ్డు ప్రమాదానికి కారణాలపై పోలీసు, రవాణా శాఖల దర్యాప్తు మొదలైంది. టిప్పర్ డ్రైవర్ గుంతను తప్పించబోయి ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. బస్సును ఢీకొట్టడానికి ముందు బ్రేక్ వేయకపోవడంతోనే ప్రమాదం

వివరాలు 2లో..

## 'సిగాచీ' దర్యాప్తు పురోగతిపై నివేదికివ్వండి



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో రియాక్టర్ పేలుడులో 54 మంది మృతి చెందిన సంఘటనపై దర్యాప్తు పురోగతి నివేదిక సమర్పించాలంటూ ప్రభుత్వానికి హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా అరెస్ట్‌లు జరిగాయా... లేదా... అని ప్రశ్నించింది. నిపుణుల కమిటీ నివేదికలో పేర్కొన్న అంశాలనూ వివరించాలంది.


వివరాలు 2లో..

## తెలంగాణకు మూడు రోజుల వర్ష సూచన



- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనాల ప్రభావం
- బుధ, గురువారాల్లోనూ అక్కడక్కడ వర్ష సూచన
- గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో నమోదైన వర్షపాతం

వివరాలు 2లో..



# ఇన్నోవేషన్ హబ్‌గా హైదరాబాద్

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**
జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

# కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయలేదేం?

- మొదటి పేజి తరువాయి
రెండు నెలల క్రితం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అనుమతి కోరితే ఇంతవరకూ ఇవ్వలేదు. కారు స్టీరింగ్ మోదీ చేతుల్లో ఉంది. జూబ్లీహిల్స్‌లో కారు గెలిస్తే.. ఢిల్లీకి వెళ్లి కమలంగా మారుతుంది. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నవారికి అవకాశమిస్తే మనం మోసపోయినట్టే" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను భాజపా వెనకేసుకొస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లొంగకపోవడం నిజమైతే.. కేసీఆర్, కేటీఆర్‌లపై ఈ నెల 11లోపు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సవాల్ విసిరారు. భాజపా నాయకులు పరోక్షంగా భారత రాష్ట్ర సమితికి మద్దతు ఇస్తున్నారని... డిపాజిట్ కూడా రాకుండా చేసుకుంటున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజారిటీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

**ఫామ్‌హౌస్‌లు లేవని ప్రమాణం చేయండి..**
"రాష్ట్రాన్ని పదేళ్లపాటు దోచుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లు రూ.వేల కోట్లు సంపాదించుకున్నారు. గజ్వేల్‌లో కేసీఆర్ ఫామ్‌హౌస్ కట్టుకుంటే... కేటీఆర్‌కు జన్వాడలో, హరీశ్‌రావుకు మొయినాబాద్‌లో, శంకర్‌పల్లిలో కవితకు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. ఒకప్పుడు కాళ్లకు చెప్పులు కూడా లేనివారంతా ఇప్పుడు బెంజ్ కార్లలో తిరుగుతున్నారు. ఫామ్‌హౌసులు లేవని వారిని ప్రమాణం చేయమనండి. జూబ్లీహిల్స్ నుంచి వంద బస్సులు పెట్టి ఇక్కడున్న వారందర్నీ ఫామ్‌హౌస్‌లకు తీసుకొస్తాం. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ మంత్రిగా ఉన్నారు. ఇప్పుడు జూబ్లీహిల్స్‌కి వచ్చి ఇక్కడ మురుగు ప్రవహిస్తోందని... వాసన వస్తోందని అంటున్నారు. మీ ఇంటికి వచ్చినప్పుడు కేటీఆర్‌ను నిలదీయండి. అప్పుడు తెలుస్తుంది... మురుగుతో మీరెన్ని అవస్థలు పడుతున్నారో.

**అజార్ భాయ్‌ని మంత్రిని చేస్తే ఎందుకంత ఉక్రోషం?**
అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రముఖుడిగా పేరొందిన అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే భాజపాకు ఎందుకంత ఉక్రోషం? ఆయనకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వకూడదో కిషన్‌రెడ్డి చెప్పాలి. మైనార్టీలను ప్రోత్సహిస్తున్నందుకు ప్రశంసించకపోయినా ఫిర్యాదు చేయకండి. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చాను. కిషన్‌రెడ్డి నాన్న జాగీర్ తీసుకోలేదు. గుజరాత్‌లో ఉన్న మోదీ భూములు లాక్కోలేదు. అజారుద్దీన్‌పై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను భారత రాష్ట్ర సమితి నాయకులు ఖండించలేదు. ఎందుకంటే ఆ రెండు పార్టీలు ఒక్కటే. లోక్‌సభలో ప్రధాని మోదీ ఇబ్బందిపడిన ప్రతిసారీ కేసీఆర్ అండగా నిలబడ్డారు. ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు... ఇందుకు ఉదాహరణలు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, అక్రమాల విషయంలో కేసీఆర్‌ను మోదీ రక్షిస్తున్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలోని పేదలకు ఏటా నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇస్తాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అజారుద్దీన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బేగ్, రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందనే కవితను గెంటేశారు..**
'అనారోగ్యంతో చనిపోయిన శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ వారసురాలిగా మాగంటి సునీతను గెలిపించాలంటూ కేటీఆర్, హరీశ్‌లు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నారు. పీజేఆర్ గుండెపోటుతో మరణిస్తే.. అభ్యర్థిని పోటీ పెట్టొద్దంటూ ఆయన భార్య, కుమార్తెలు కేసీఆర్ ఇంటికి వెళ్తే మూడు గంటలపాటు నిల్చోబెట్టారు. పాలేరు, నారాయణఖేడ్‌లలో ఎమ్మెల్యేలు ఆకస్మికంగా మరణిస్తే.. వారి కుటుంబ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికవకుండా కేసీఆర్, కేటీఆర్‌లు తమ అభ్యర్థులను పోటీగా నిలబెట్టారు. రూ.వేల కోట్ల ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని కవితను గెంటేశారు. ఆమె రాష్ట్రంలో పర్యటిస్తూ.. తనకు అన్యాయం చేసినవారిని శపిస్తున్నారు. భాజపాతో భారీస్థాయిలో ఒప్పందాలున్నాయని, త్వరలో భారత రాష్ట్ర సమితి విలీనమవుతుందంటున్న కవిత మాటలను వారు ఎందుకు ఖండించలేదు? ఇంటి ఆడబిడ్డను బహిష్కరించినవారు సునీతను ఎలా ఆదుకుంటారు? పైగా ఆడబిడ్డలకు కాంగ్రెస్ అన్యాయం చేస్తోందని విషప్రచారం చేస్తున్నారు' అని సీఎం పేర్కొన్నారు.

# 'సిగాచీ' దర్యాప్తు పురోగతిపై నివేదికివ్వండి

- మొదటి పేజి తరువాయి
ఇప్పటివరకు మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రకటించినట్లుగా ఒక్కొక్కరికి ఎంత పరిహారం అందించారన్న దానిపై జాబితా సమర్పించాలని ఆదేశించింది. సిగాచీ యాజమాన్యాన్ని కౌంటరు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది మృతి చెందగా, 8 మంది కనిపించలేదని, 28 మంది తీవ్రంగా గాయపడ్డారని వారికి పరిహారం అందించడంలో, దర్యాప్తులో జాప్యం జరుగుతోందని, దర్యాప్తును సిట్‌కు అప్పగించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన కె.బాబూరావు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

పిటిషనర్ తరఫు న్యాయవాది వసుధానాగరాజ్ వాదనలు వినిపిస్తూ... "నాలుగు నెలలు గడిచినా దర్యాప్తు ముందుకెళ్లడంలేదు. అరెస్ట్‌లు జరగలేదు. బాధితులకు, మృతుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారం అందలేదు" అని తెలిపారు. అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... దర్యాప్తు కొనసాగుతోందని, ఇప్పటివరకు 192 మంది సాక్షుల వాంగ్మూలాలను సేకరించినట్లు తెలిపారు. ప్రమాదంలో కంపెనీ ఉపాధ్యక్షుడు కూడా మృతి చెందారనగా ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... "ఉపాధ్యక్షుడు చనిపోయారన్న కారణంగా మిగిలిన బాధ్యులను వదిలేస్తారా..? ఫ్యాక్టరీ ఆవరణను సీజ్ చేశారా..? చేయబోతున్నారా.. అది ఎవరి అధీనంలో ఉంది" అని ప్రశ్నించింది. ఏఏజీ సమాధానమిస్తూ... ఫ్యాక్టరీ ఆవరణను కార్మికశాఖ స్వాధీనం చేసుకుందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున చెల్లిస్తామన్న యాజమాన్యం హామీపై ధర్మాసనం ప్రశ్నకు ఏఏజీ స్పందిస్తూ... ఒక్కో కుటుంబానికి కౌంటరు దాఖలు చేసేనాటికి రూ.40 లక్షలు, అదృశ్యమైన వారికి రూ.25 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. వాదనలను విన్న ధర్మాసనం అన్ని వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

# పాకిస్థాన్ ను ఏరిపారేద్దాం

మొదటి పేజీ తరువాయి
మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకు రక్షణ రంగంలో కీలక ఒప్పందం చేసుకోనున్నట్లు స్పష్టం అవుతోంది. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోనే సర్ భారత్ పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ గ్లోబల్ సూపర్ పవర్ అని ప్రశంసించారు. ఇజ్రాయెల్- భారత్ మధ్య సత్సంబంధాలు మరింత దృఢంగా ఉన్నాయని తెలిపారు. రక్షణ, కౌంటర్ టెర్రరిజం రంగాల్లో ఇరు దేశాలు సహకరించుకుంటున్నాయని వివరించారు. హమాస్ దాడుల సమయంలో భారత్ అందించిన మద్దతు తాము ఎప్పటికీ మర్చిపోమని తెలిపారు. గాజా శాంతి విధానంలో భారత్ పాత్ర మెచ్చుకోదగినదని వివరించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందాలను మరింత విస్తరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోనే సర్ తెలిపారు. భారత పర్యటనలో భాగంగా ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోనే సర్ ఓ న్యూస్ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మేము క్రమంగా అభివృద్ధి చెందుతున్నాం. భారత్ స్నేహానికి రుణపడి ఉంటాం. డిఫెన్స్, అగ్రికల్చర్, ఎకానమీ రంగాల్లో భారత్ కలిసి ముందు కెళ్తాం. అక్టోబర్ 7 న హమాస్ మా పై దాడి చేసినప్పుడు వెంటనే ప్రధాని మోదీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కు ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. ఆ విషయాన్ని మేము మర్చిపోలేదు. టెర్రరిజం ప్రతి చోటా ఉంది, ఉగ్రవాదంతో భారత్, ఇజ్రాయెల్ ఇబ్బందులు పడింది. మేము డిఫెన్స్, ఇంటెలిజెన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ తో కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యాం అని విదేశాంగ మంత్రి గిడియోనే సర్ తెలిపారు. యుద్ధం కారణంగా ఇండియా-మిడిల్ ఈస్ట్- యూరోప్(ఐఎంఈసి) కారిడార్ ఆగిపోయింది. త్వరలోనే ఈ కారిడార్ ను ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. భారత్- ఇజ్రాయెల్ మధ్య డైరెక్ట్ ఫ్లైట్స్ ప్రారంభించాల్సిన సమయం వచ్చిందన్నారు. తద్వారా ఇరు దేశాల మధ్య టూరిజం, ట్రేడ్ పెరుగుతుందని తెలిపారు. అలాగే ఇజ్రాయెల్ అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన భారతీయ కార్మికుల సంఖ్య కూడా పెరుగుతుందని వివరించారు. మరో వైపు త్వరలో భారత ప్రధాని నరేంద్ర మోదీ తో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు సమావేశం కానున్నట్లు స్పష్టం అవుతోంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోనే సర్ ధృవీకరించారు. వచ్చే ఏడాది భారత్ లో జరిగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్ లో ఇజ్రాయెల్ పాల్గొబోతుందని హింట్ ఇచ్చారు.

# చేయని నేరానికి 43 ఏళ్లు జైలు లోనే.. ఇప్పుడు దేశ బహిష్కరణ!

మొదటి పేజీ తరువాయి
9 నెలల వయసులో చట్ట బద్ధంగా భారత్ నుంచి అమెరికాకు వలస వెళ్లి అక్కడ శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) పొందారు. పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీలో ఆయన తండ్రి ప్రొఫెసర్‌గా పనిచేయడంతో, అక్కడే పెరిగిన వేదం 1982 లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న కొద్ది రోజులకే అరెస్ట్ అయ్యారు. కేసు నేపథ్యం ఇలా 1980 లో ఆయన ఫ్రెండ్ థామస్ కిన్సర్ హత్యతు గురయ్యాడు. చివరిసారిగా కిన్సర్ తో కనిపించిన వ్యక్తి సుబ్రమణ్యం వేదం కావడంతో బలమైన ప్రత్యక్ష సాక్ష్యాలు లేకపోయినా, పోలీసులు అతడిని నిందితుడిగా చేర్చారు. 1983 లో కోర్టు రెండుసార్లు అతడిని దోషిగా నిర్ధారించింది. ఫలితంగా పెరోల్ లేకుండా జీవిత ఖైదు పడింది. 40 ఏళ్లకు పైగా జైలులో ఉండి న్యాయం కోసం పోరాడిన సుబ్రమణ్యం వేదం తరఫు న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు దశాబ్దాలుగా ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టిన కీలకమైన బాలిస్టిక్స్ ఆధారాలను ఇటీవల బయట పెట్టారు. ఈ ఆధారాల వల్ల సుబ్రమణ్యం వేదం నిర్దోషి అని నిరూపణ అయ్యింది. దీంతో ఈ ఏడాది ఆగస్టులో న్యాయమూర్తి ఆయన శిక్షను రద్దు చేసి, నిర్దోషిగా ప్రకటించారు. ఒక అన్యాయం ముగియకముందే మరొకటి అక్టోబర్ 3 న పెన్సిల్వేనియా జైలు నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాల్సిన సుబ్రమణ్యం వేదంను అప్పటికే సిద్ధంగా ఉన్న ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ (ఐసీఈ) అధికారులు తక్షణమే అదుపు లోకి తీసుకున్నారు. బహిష్కరణల కోసం ప్రత్యేకంగా ఎయిర్‌స్ట్రిప్ ఉన్న లూసియానా లోని డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. ఐసీఈ అధికారులు సుబ్రమణ్యం వేదంను బహిష్కరించడానికి కారణం ఆయన సుమారు 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఎల్ఎస్‌డీ డెలివరీకి సంబంధించిన డ్రగ్స్ కేసులో గతంలో దోషిగా నిర్ధారించబడటమే. హత్య కేసులో తీర్పు మారినంత మాత్రాన, ఈ పాత డ్రగ్స్ కేసు శిక్ష రద్దు కాదని, అందుకే బహిష్కరణకు అర్హుడని హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్పష్టం చేసింది. న్యాయవాదుల వాదన కోర్టుల జోక్యం సుబ్రమణ్యం వేదం తరఫున లాయర్లు, ఆయన సోదరి సరస్వతి వేదం

ఐసీఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. చేయని నేరానికి 43 ఏళ్లు జైల్లో మగ్గిన వ్యక్తి విషయంలో ఈ పాత చిన్నపాటి డ్రగ్స్ కేసును పరిగణన లోకి తీసుకోరాదని వారు వాదించారు. జైల్లో ఉన్నప్పుడే ఆయన మూడు డిగ్రీలు సంపాదించి, తోటి ఖైదీలకు ట్యూటర్‌గా సేవలందించారని, అతని సుదీర్ఘమైన తప్పుడు నిర్బంధాన్ని పరిగణించాలి అని కోర్టును అభ్యర్థించారు. ఈ వాదనల నేపథ్యంలో, తాత్కాలికంగా ఉపశమనం లభించింది. ఇమ్మిగ్రేషన్ కోర్టులో ఇమ్మిగ్రేషన్ న్యాయమూర్తి సుబ్రమణ్యం వేదం బహిష్కరణను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పెన్సిల్వేనియా లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు కూడా ఆయన బహిష్కరణ పై స్టే విధించింది.

## భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ..

మొదటి పేజీ తరువాయి
ఎమ్మెల్యే నాగమాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన నాయుడు మాట్లాడారు. ఉత్తరాంధ్రా సంస్కృతికి ప్రతిబింబంగా భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. వచ్చే నెలలో భోగాపురం విమానాశ్రయం నుంచి ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. భోగాపురంలో ఏవియేషన్ యూనివర్సిటీ నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. శ్రీకాకుళం, భోగాపురంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. విశాఖపట్నంలో వచ్చే నెలలో జరుగనున్న అంతర్జాతీయ సమ్మిట్ లో భోగాపురం విమానాశ్రయ పరిసరాల్లో పలు పరిశ్రమల స్థాపనకు తగిన నివేదిక అందజేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన నాయుడు పేర్కొన్నారు.

## భారత్ కు రష్యా చమురు పై ఫలిస్తున్న ట్రంప్ వ్యూహం..!

మొదటి పేజీ తరువాయి
ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యూహం మార్చారు. భారత్ పై ఒత్తిడి పెంచి ఉపయోగం లేదని భావించిన ట్రంప్, రష్యా చమురు రిఫైనరీలను టార్గెట్ చేసారు. ఈయూతో కలిసి రష్యా లోని చమురు రిఫైనరీల పై ఆంక్షలు విధించడం ప్రారంభించారు. ఈ ఆంక్షల్ని ఈ నెల 21 నుంచి అమల్లోకి తీసుకువస్తున్నారు. దీంతో ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్న రష్యా చమురు కంపెనీలు కాస్తా వెనక్కి తగ్గక తప్పడం లేదని తెలుస్తోంది. భారత్ కు ఎగుమతి చేస్తున్న డిస్కౌంట్ చమురును తగ్గించు కోవాలని రష్యా ఆయిల్ రిఫైనరీలు నిర్ణయించాయి. అక్టోబర్ నెల ఆరంభ వారాలతో పోలిస్తే చివరి వారానికి భారత్ కు ఎగుమతి చేస్తున్న చమురును రోజుకు 1.95 మిలియన్ బ్యారెళ్ల నుంచి 1.19 మిలియన్ బ్యారెళ్లకు అవి తగ్గించేసినట్లు అంతర్జాతీయ వెసెల్ ట్రాకర్ కెప్లర్ డేటా చెబుతోంది. ఈ మేరకు రష్యా చమురు రిఫైనరీలు రోజ్ నెఫ్ట్, లూక్ ఆయిల్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీని పై మరో నెల రోజుల్లో మరింత క్లారిటీ వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారత్ ను రష్యా చమురు కొనకుండా ఆపేందుకు విశ్వప్రయత్నాలు చేసి విఫల మైన ట్రంప్.. ఇప్పుడు ఆ దేశ చమురు రిఫైనరీ లను టార్గెట్ చేయడం ద్వారా ఆ పనిని విజయవంతంగా పూర్తి చేస్తున్నట్లు అర్థమవుతోంది. అదే జరిగితే భారత చమురు రిఫైనరీలు ఇప్పుడు రష్యా కాకుండా ఇతర ప్రత్యామ్నాయాల పై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే దుబాయ్ తో పాటు ఇతర గల్ఫ్ దేశాలను ఈ విషయంలో సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే అమెరికా నుంచి కూడా చమురు దిగుమతులు పెంచే అవకాశాలున్నాయి.

## రైతులకు, మహిళలు, ఉద్యోగులకు వరాలు కురిపించిన తేజస్వియాదవ్

మొదటి పేజీ తరువాయి
రూ. 300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళలకు ఏటా సంక్రాంతికి రూ.30 వేలు వాళ్ల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు ఆర్జేడీ పార్టీ నేత, కూటమి సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్. ప్రభుత్వ ఉద్యోగు లైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యక్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలో మీటర్ల లోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. తమ కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత మాయ్-బహిన్ మాన్ యోజనా పేరిట ఈ పథకం తీసుకొస్తామని చెప్పారు. ఈ యోజన కింద, ప్రతి మహిళకు మకర సంక్రాంతి (జనవరి 14) నాడు రూ. 30,000 నగదు సహాయం అందజేయ బడుతుందని తేజస్వి పేర్కొన్నారు. మేము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, మకర సంక్రాంతి నాడు ఈ యోజనను అమలు చేస్తాం. ఇది బీహార్‌లోని ప్రతి తల్లి, సోదరి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు సహాయపడుతుంది అని అన్నారు. ఈ ప్రకటన బీహార్ లోని మహిళా ఓటర్ల పై గట్టి ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముందు నుంచీ తేజస్వి యాదవ్ తన ప్రచారంలో మహిళా ఓటర్ల పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

## బ్రేక్ వేయకపోవడంతోనే దారుణం?

- మొదటి పేజి తరువాయి
జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. టిప్పర్‌లో పరిమితికి మించి కంకర లోడుతోపాటు అతివేగంతో... ఒక్కసారిగా కుడివైపు తిప్పడంతో అదుపుతప్పి నియంత్రణ కోల్పోయినట్లు విశ్లేషిస్తున్నారు. బస్సును టిప్పర్ ఢీకొట్టిన తర్వాత 50-60 మీటర్ల దూరం వరకు ఈడ్చుకెళ్లింది. దీన్నిబట్టి బ్రేక్ వినియోగించకపోవడం లేదంటే పడకపోవడం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. టిప్పర్‌ను రవాణా శాఖ అధికారులు పరిశీలించారు. యజమాని లచ్చునాయక్ ఈ ఏడాదే దాన్ని కొనుగోలు చేసినా.. బ్రేకులు ఎలా పనిచేస్తున్నాయనే కోణంలో ఆరా తీస్తున్నారు. డ్రైవర్ ఆకాశ్ ధన్య కాంబ్లే(23)కు లైసెన్స్ ఉందని అధికారులు చెబుతున్నారు. టిప్పర్ నడపాలంటే హెవీ మోటార్ లైసెన్స్ ఉండాలి. అతను మహారాష్ట్రలోని నాందేడ్‌లో లైసెన్స్ తీసుకున్నాడు. దాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు అది... అసలైనదేనా అని నిర్ధారించుకోవడానికి మహారాష్ట్ర అధికారుల్ని సంప్రదిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడు వాహనం ఎంత వేగంతో ఉందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

**నోరు, ముక్కు భాగాల్లో దుమ్ము**
ప్రమాదంలో మరణించిన 19 మందిలో 17 మంది నోరు, ముక్కులో కంకర దుమ్ము ఎక్కువగా ఉన్నట్లు పోస్టుమార్టం చేసిన వైద్యులు పేర్కొన్నారు. గాయపడిన 24 మందికి చికిత్స కొనసాగుతోంది. ఐదుగురి పరిస్థితి కొంత విషమంగా ఉన్నా... క్రమంగా కోలుకుంటున్నారు. చేవెళ్లలోని పీఎంఆర్ ఆసుపత్రిలో 14 మంది... వికారాబాద్‌లోని ప్రభుత్వాసుపత్రిలో 10 మంది చికిత్స పొందుతున్నారు. కోలుకున్న బాధితుల నుంచి వాంగ్మూలం సేకరిస్తామని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ డ్రైవర్లు ఇద్దరూ మరణించడంతో బాధితుల వాంగ్మూలం కీలకంగా మారనుంది. వారిద్దరూ ఒకవేళ డ్రంకెన్ డ్రైవ్ చేశారేమో అనే అనుమానంతో వారి రక్త నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు రావాల్సి ఉంది.

## తెలంగాణకు మూడు రోజుల వర్ష సూచన

: తెలంగాణ రాష్ట్ర ప్రజలకు హైదరా బాద్ వాతావరణ కేంద్రం వర్ష సూచన అందించింది. బంగాళా ఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు కూడా వీస్తాయని హెచ్చరించింది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ తీరానికి ఆనుకొని

మధ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీనికి తోడు ఉత్తర తమిళనాడు తీర ప్రాంతంలో 5.8 కిలోమీటర్ల ఎత్తులో మరో ఆవర్తనం ఏర్పడింది. ఈ రెండింటి ప్రభావంతో తెలంగాణలో వాతావరణం మారిందని, వర్షాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని అధికారులు వివరించారు.ముఖ్యంగా మంగళవారం రాష్ట్రంలోని నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడవచ్చని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున, ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఇక బుధ, గురువారాల్లో సైతం రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి జల్లుల నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది.ఇదిలా ఉండగా, గడిచిన 24 గంటల్లో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, వికారాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, కొత్తగూడెం తదితర జిల్లాల్లో ఇప్పటికే తేలికపాటి వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ వెల్లడించింది.

## హైదరాబాద్‌లో కాల్పుల కలకలం..

హైదరాబాద్ నగరంలోని మణికొండ పంచవటి కాలనీలో కాల్పుల కలకలం రేగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రభాకర్, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుటుంబాల మధ్య ఈ వివాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.కేఈ ప్రభాకర్ కుమార్తెకు, నందీశ్వర్ గౌడ్ పెద్ద కుమారుడు అభిషేక్ గౌడ్‌కు వివాహం జరిగింది. కొంతకాలంగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతుండటంతో విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో తన కుమార్తెకు కట్నంగా ఇచ్చిన ఫ్లాట్‌ను ఖాళీ చేయాలని అల్లుడు అభిషేక్ గౌడ్?పై కేఈ ప్రభాకర్ ఒత్తిడి తెచ్చారు. ఆ సమయంలో అభిషేక్ గౌడ్ తన వద్ద ఉన్న తుపాకీతో ప్రభాకర్‌ను బెదిరించినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం.గత కొంతకాలంగా వీరి మధ్య వివాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. తనను అభిషేక్ గౌడ్ బెదిరిస్తున్నాడని అక్టోబర్ 25నే రాయదుర్గం పోలీసులకు కేఈ ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. దీంతో అభిషేక్ గౌడ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కాల్పులు చోటు చేసుకోవడం గమనార్హం.

ఈ ఘటనపై రాయదుర్గం ఎస్‌హెచ్ఓ మాట్లాడుతూ, ఏపీకి చెందిన నాయకుడి కుమార్తె, తెలంగాణకు చెందిన నాయకుడి కుమారుడి మధ్య వివాదం తలెత్తిందని, వారికి 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వ్యక్తిగత కారణాల వల్ల ఒక సంవత్సరం నుంచి వేర్వేరుగా జీవిస్తున్నారని తెలిపారు. గత నెల 25న పంచవటి కాలనీలోని ఆస్తి విషయంలో ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుని పాత్ర కీలకం...

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్), నవంబర్ 04,** పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర మరియు వారి కృషి కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు.మంగళవారం సుజాతనగర్ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ఆయన పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, సౌకర్యాలు వంటి అంశాలను సమీక్షించారు. స్వచ్ఛత కాంపైన్ 5.0 కార్యక్రమం కింద పాఠశాలలో చేపట్టిన శుభ్రతా చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ రోజున పాఠశాలలో ఏ ఏ పనులు చేపట్టారు అని ఉపాధ్యాయులను అడిగి , ఈ రోజున చేయవలసిన పనులు సక్రమంగా జరగకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వం చేపడుతున్న ప్రతి విద్యా కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల సమన్వయంతో, విద్యార్థుల భాగస్వామ్యంతో, తల్లిదండ్రుల సహకారం తో అమలు చేసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.పాఠశాల అభివృద్ధి అనేది కేవలం భవన నిర్మాణం లేదా వసతుల పెంపు కాదు, అది ఒక సమగ్ర ప్రక్రియ. అందులో ప్రధానోపాధ్యాయుడు కీలక నాయకత్వ పాత్ర పోషించాలి. విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం ఇవన్నీ ప్రధానోపాధ్యాయుని దిశానిర్దేశంపై ఆధారపడి ఉంటాయి, అని అన్నారు.

పాఠశాలలోని టాయిలెట్లను పరిశీలించిన కలెక్టర్, కొన్ని టాయిలెట్లు మూసివేసి తాళం వేసి ఉంచినట్లు గమనించి అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం అందుబాటులో ఉన్న వసతులను వినియోగించకపోవడం నిర్లక్ష్యమని పేర్కొని, వెంటనే టాయిలెట్లను తెరిచి మరమ్మతులు పూర్తి చేయాలని పాఠశాల మేనేజ్మెంట్ గ్రాంట్ ద్వారా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

త్రాగునీటి సౌకర్యం తగిన విధంగా లేని విషయం గమనించిన కలెక్టర్, పాఠశాలలో కొత్త బోర్ వేయడం కోసం తక్షణమే ప్రతిపాదనలు సమర్పించాలని విద్యాశాఖాధికారి మరియు మిషన్ భగీరథ ఈ ఈ కు ఆదేశించారు. విద్యార్థులకు నిరంతరంగా శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఇది పీఎం శ్రీ పాఠశాల కావడంతో, ఆటస్థల అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగించి, విద్యార్థుల క్రీడా ప్రతిభను పెంపొందించే దిశగా అన్ని ఆటలకు సంబంధించిన కోర్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందని, క్రమశిక్షణతో పాటు సమూహ భావన కూడా పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

పాఠశాల ప్రాంగణం బయట నిర్మాణంలో ఉన్న భవిత కేంద్రంను కూడా ఆయన పరిశీలించారు. భవనం చాలా లోతులో నిర్మించబడినందున వర్షపు నీరు నిలిచే ప్రమాదం ఉందని గమనించి, సరైన ఎత్తు పెంచి మిగతా నిర్మాణ పనులు కొనసాగించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. భవిత కేంద్రాలు పాఠశాలలకు విలువైన వనరుల కేంద్రాలుగా మారాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, కాబట్టి వాటి నిర్మాణం నాణ్యతతో కూడినదిగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

కలెక్టర్ ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మరియు విద్యార్థుల ప్రతిభను పెంపొందించే పద్ధతులపై చర్చించారు. ప్రతి ఉపాధ్యాయుడు పాఠశాల స్థాయిలో మార్పు తీసుకురాగలడని, వారి కృషితోనే ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆదర్శవంతమైనవిగా మారుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇస్లాంపూర్ పశు ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన డాక్టర్ లింగమూర్తి

లింగమూర్తి అభినందించిన జిల్లా అధికారులు లయన్స్ సభ్యులు



**నవంబర్ 04 (సీ కే న్యూస్) చేగుంట:**తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలోనీ పశు ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి రంగులు వేసి, బోర్డ్, చార్టర్ బోర్డ్ వ్రాపియడం తోపాటు 4 ఆఫీస్ కుర్చీలను ఆ శాఖ అసిస్టెంట్ పశువైద్యాధికారి లయన్ డాక్టర్ లింగమూర్తి తన జన్మదిన సందర్భంగా 20వేల రూపాయలు జీతం డబ్బులు హెచ్చించి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పాత పాడు బడిన భవనం ను కొత్త హంగులతో నూతన ఒరవడి తో తీర్చిదిద్దిన డాక్టర్ లింగమూర్తి నీ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య, ఏడి తిరుపతి, డాక్టర్ లక్ష్మీశ్రీ తోపాటు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ 320డి సిద్దిపేట రీజియన్ చైర్మన్ లయన్ సంజయ్ గుప్త లు
మంగళవారం పశు ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని పరిశీలించి లింగమూర్తి నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య, ఏడి తిరుపతి, డాక్టర్ లక్ష్మీశ్రీ, డాక్టర్ లింగమూర్తి, రీజియన్ చైర్మన్ లయన్ సంజయ్ గుప్త, రీజినల్ కో ఆర్డినేటర్ లయన్ శ్రీనివాస్ గుప్త, ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ తాడురీ కృష్ణారెడ్డి, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజ్, లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, జోన్ చైర్మన్ లయన్ ఆకుల సుఖేందర్, చేగుంట క్లబ్ శంభుని శ్రీనివాస్, నాగరాజు, బ్రహ్మచారి, సంజీవ్, రామచంద్రం, నాగరాజు, రవి, పశువైద్య సిబ్బంది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# పశు సంరక్షణ కోసం వైద్య శిబిరం

**నవంబర్ 04 (సి కే న్యూస్) చేగుంట :**
పశువులు ఆరోగ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోండి
గుండ్రెడ్డిపల్లి లో విజయవంతంగా ఉచిత పశు వైద్య శిబిరం
పశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే వాటి పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య తెలిపారు. మంగళవారం ఇంటర్ నేషనల్ లయన్స్ క్లబ్స్ 320 డి డిస్ట్రిక్ట్ సెక్రెటరీ ఫర్ వెటర్నరీ క్యాంప్స్ లయన్ డాక్టర్ లింగమూర్తి జన్మదినం సందర్భంగా గుండ్రెడ్డిపల్లి లో ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ తాడురీ కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత మేఘా పశు వైద్య శిబిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు శుభ్రమైన నీరు అందించడం, పచ్చి మేత ఇవ్వడం, వేడి వాతావరణంలో నీడ కల్పించడం, వ్యాధులను నివారించడానికి టీకాలు వేయించడం, మరియు వ్యాధులు సోకితే వెంటనే ఇతర ఆరోగ్యకరమైన పశువుల నుండి వేరుచేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. పశు సంరక్షణ అనేది ప్రతి రైతు బాధ్యత అని పశువుల గురించి రైతు కుటుంబాలు పూర్తి అవగాహనతో ఉండి పశువుల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ సిద్దిపేట రీజియన్ చైర్మన్ లయన్ సంజయ్ గుప్త మాట్లాడుతూ నేటి బర్త్ డే బాయ్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ లయన్ డాక్టర్ లింగమూర్తి తన జన్మదిన సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 5వ తేదీన తన ఒక నెల జీతం డబ్బులు హెచ్చించి పశువులకు బల సంవర్ధక మందులు రైతులకు అందించి వాటిని ఎలా ఎప్పుడూ ఉపయోగించాలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తూప్రాన్ సీనియర్ పశు వైద్య అధికారి డాక్టర్ లక్ష్మీశ్రీ మాట్లాడుతూ పశువులను పెంచడం తోపాటు వాటి సంరక్షణ అనేది చాలా ముఖ్యమైన పాత్ర అని అన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలనీ సూచించారు. అనంతరం తూప్రాన్ లయన్స్ క్లబ్ లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజు మాట్లాడుతూ పశువులకు ఎల్లప్పుడూ శుభ్రమైన, స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉంచాలన్నారు. నీటి తొట్టెలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. పశువులకు పచ్చి మేతతో పాటు ఎండు మేత కలిపి అందించాలన్నారు. ప్రతిరోజూ పశువులకు అవసరమైన మొత్తంలో దాణా ఇవ్వాలన్నారు. పశువులకు అవసరమైన వ్యాక్సిన్లు, టీకాలు సకాలంలో వేయించాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తిరుపతి, ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ తాడురి కృష్ణారెడ్డి, రీజియన్ చైర్మన్ లయన్ సంజయ్ గుప్త, రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ గుప్త, జోన్ చైర్మన్ లయన్ ఆకుల సుఖేందర్, లీడర్ షిప్ చైర్మన్ లయన్ బుడ్డ భాగ్యరాజు, సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్, చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ శంభుని శ్రీనివాస్, సెక్రెటరీ నాగరాజు, లయన్ బ్రహ్మచారి, లయన్ సంజీవ్, లయన్ రామచంద్రం, లయన్ నాగరాజు, లయన్ రవి, పశు వైద్య సిబ్బంది రాజిరెడ్డి, రవి, చిరంజీవి, రామస్వామి, అశోక్, రమేష్, కృష్ణ, రామకృష్ణ, నిషారొద్దిన్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేటు విద్యాసంస్థల బంద్ కు స్పందించని ప్రభుత్వం.




- ప్రైవేట్ కాలేజీ విద్యార్థులు ఇంటి బాట..
- విద్యార్థులు భవిష్యత్తును దెబ్బతీస్తున్న ప్రభుత్వం
- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**భద్రాచల పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు, రాష్ట్ర వ్యాప్త బందులో భాగంగా భద్రాచలంలో కూడా బందు చేయడం జరిగినది.

ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిలను విడుదల చేయాలని లేనియెడల మంత్రుల ఇళ్లను ఎమ్మెల్యేల ఇల్లను ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కొప్పుల రవీందర్ హెచ్చరించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్ చేయటం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని ఆయన అన్నారు.

గత ప్రభుత్వం లాగానే ఈ ప్రభుత్వం కూడా విద్య వ్యతిరేక దిశగా తీసుకెళ్తుందని అన్నారు. ప్రైవేటు యాజమాన్యాలకు ఇచ్చినటువంటి టోకెన్ల నిధులు కూడా ఇవ్వలేదని కాలేజీ యాజమాన్యాలు అందోలన కు దిగాయని, దీని వల్ల విద్యార్థులు చాలా నష్టపోతారని. ఆవేదన వ్యక్తం చేశారు.
ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోవడం మరో మార్గం లేక సమ్మెలోకి ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజు బకాయిలు అడిగితే ప్రభుత్వ విజిలెన్స్ విచారణకు ఆదేశించడం బాధాకరమని పేదల అండగా ఉండాల్సిన ప్రభుత్వం విజిలెన్స్ పేరుతో బెదిరించడం సరికాదు ఏదేమైనా కాలేజీ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను దుర్వినియోగం చేసామని ప్రభుత్వం భావిస్తే దానికి కారణం కాలేజీ యజమాన్యాలు కాదు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన తహసిల్దార్లే కారణం ప్రభుత్వం వారిని కూడా బాధ్యులను చేయాలని కొప్పుల రవీందర్ డిమాండ్ చేశారు.
సిబ్బందికి జీతాలు కూడా ఇచ్చుకోలేని దుస్థితిలో విద్యా సంస్థల యాజమాన్యాలు ఉన్నాయని అలాంటి పరిస్థితుల్లో న్యాయమైన విద్య ఎలా సాధ్యమని ప్రశ్నించారు కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి రెండేళ్ల పాటు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఓపిక పట్టమని చెప్పారు కాలేజీ యజమానులకు ఇది జీవన్మరణ సమస్య అని అన్నిటికి సిద్ధమయ్యే సమ్మెకు దిగామని పేర్కొన్నారు. స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి అని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు హామీ ఇచ్చినట్టుగా తక్షణమే 12 వేల కోట్లు నిధులను విడుదల చేయాలి. విద్యార్థులు ఎస్ఎఫ్ఐ తో కలిసి పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు సాయి, సురేష్, దీపక్, వెంకట్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల ను పరిశీలించిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**ఇందిరమ్మ గృహానికి దర్వాజ నిర్మించే కార్యక్రమంలో పాల్గొన్న. గ్రామ కాంగ్రెస్ నాయకులు.......... చింతకాని మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టఆత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహనికి,సింహం ద్వారమైనా దర్వాజను ఎత్తడం జరిగినది ఈ కార్యక్రమంలో లబ్దిదారులు మొగిలి పద్మ, మరియు వారి కుటుంబసభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మరీదు రామకృష్ణ గౌడ్, మండల సేవాదళ్ అధ్యక్షులు పర్చగాని సతీష్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆత్మకూరి రవికుమార్, అరివికోట్ల ఏషోబ్, మోచర్ల చంద్రశేఖర్, వారి బంధువులు తదితరులు పాల్గొని, గత పది సంవత్సరాలలో ప్రభుత్వ ఇండ్లు ఏనాడూ కూడా చూడలేదు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లోనే, ఇందిరమ్మ ఇండ్లను చూస్తున్నాము, అని సంతోషం వ్యక్తంచేస్తు, ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టివిక్రమార్క ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం తదితరులు పాల్గొన్నారు

## కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా మద్దిశెట్టి నియామకం...

- భారతీయ యువసేవ సంఘం నుంచి మద్దిశెట్టి సామేలు కిసాన్ మోర్చా నేషనల్ ప్రెసిడెంట్‌గా అరుదైన అవకాశం లభించింది.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**ఈ నియామకం భారతీయ యువసేవ సంఘం జాతీయ అధ్యక్షులు జి. రోషన్ గుప్తాసూచనల మేరకుజరిగింది. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలానికి చెందిన మద్దిశెట్టి కి ఈ గౌరవం దక్కడం రాష్ట్రానికి గర్వకారణం.మద్దిశెట్టి నేషనల్ ఫౌండర్ భరణి బాలకృష్ణన్ ,నేషనల్ ప్రెసిడెంట్ రోషన్ గుప్తానేషనల్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ సౌరవ్ దాస్ నేషనల్ సెక్రటరీ షేక్ షావలి మరియు మిగతా కోర్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ యువసేవ సంఘం ( బి వై ఎస్ ఎస్) అనేది భారత ప్రభుత్వం హోం మంత్రిత్వ శాఖ, గృహనిర్మాణ శాఖ, ఎం ఎస్ ఎం ఈ మీ వంటి శాఖలతో అనుబంధంగా పనిచేసే జాతీయ స్థాయి సంస్థ. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ( ఆర్ఎస్ఎస్) సిద్ధాంతాల తో పని చేస్తూ దేశ యువతలో సేవా, జాతీయతా, వ్యవసాయ అభివృద్ధి భావాలను పెంపొందిస్తోంది.

# స్వయం ఉపాధి దిశగా అడుగులు.....!

- విద్యార్థులకు ప్రేరణగా అవేర్‌నెస్ ప్రోగ్రాం......




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ పాల్వంచ ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచలో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, హైదరాబాద్ , ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో "ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రాం" విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాస్టర్ ట్రైనర్ కస్తూరి మరియు బిజినెస్ కోచ్ డాక్టర్ షఫీ ఉద్దీన్ హాజరై విద్యార్థుల ను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి పద్మ మాట్లాడుతూ%ొ%ఇలాంటి అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి, స్టార్టప్‌ల వైపు దారితీస్తాయి అన్నారు. రిసోర్స్ పర్సన్ కస్తూరి మాట్లాడుతూ .."ప్రస్తుత యుగంలో యువత తమ సొంత ఆలోచనలతో కొత్త వ్యాపారాలు ప్రారంభించగల సామర్థ్యం కలిగి ఉంది అని అన్నారు. సాంకేతిక విద్యతో పాటు ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ కూడా అవసరం," అని పేర్కొన్నారు.డాక్టర్ షఫీ ఉద్దీన్ మాట్లాడుతూ .. "ఇన్నోవేషన్, బిజినెస్ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవడం ప్రతి విద్యార్థికి అవసరం అని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో స్వయం ఉపాధి దిశగా ఆలోచనలకు ప్రేరణ కలిగిస్తాయి," అని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో. కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. స్పష్టం చేశారుఅరుణకుమారి, కో కో ఆర్డినేటర్ కోటగిరి రాంబాబు మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ పారెల్లి శ్రీనివాస్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె మాధవి డాక్టర్ వేముల కామేశ్వరరావు డాక్టర్ శెట్టి స్వరూపారాణి డాక్టర్ శ్రీదేవి పొట్లపు శ్రీనివాసరావు బాబ్జి ఖాన్ ఈ శ్రీను రమేష్ విమల దీపిక వకుల కరిమ ధర్మారావు పవన్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్
- రైతుల ప్రయోజనాల దృష్ట్యా బంద్‌లో ఎవరూ పాల్గొనరాదు..




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),నవంబర్ 04,** జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరం లో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిసిఐ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపునిచ్చిన బంద్ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిన్నింగ్ మిల్లులను బంద్ చేయరాదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లులను యథాతథంగా కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 రకాల సమస్యలు లేకపోవడంతో, బంద్ అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతులు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, పత్తి కొనుగోలు ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం కలగకుండా అన్ని మిల్లులు నిరాటంకంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పత్తి తేమ శాతం 12% మించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తేమ శాతం పై రైతులకు అవగాహన కల్పించి, పత్తి నాణ్యతను కాపాడే విధంగా సూచనలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా మార్కెట్ యార్డులలో పత్తి ఆరబెట్టడానికి తగిన సౌకర్యాలు కల్పించి, పత్తి తడివేయకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలని కలెక్టర్ సూచించారు.రైతులు సమయానికి పత్తిని మార్కెట్‌కు తీసుకురావడంతో పాటు, మిల్లులు నిరాటంకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, సిసిఐ బయ్యర్లు, జిల్లా మార్కెట్ కమిటీల కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్యం షాపులు జనా వాసాల నుండి దూరంగా ఏర్పాటు చేసుకోవాలి.

- కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, బి, ఎన్, రెడ్డి.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 4.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని అరూరు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ. మండలకేంద్రాలలో గ్రామాలలో జన ఆవాసాలకు కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి అవినీతి నిర్మూలన ఐక్య వేదిక వ్యవస్థాపకులు బందారు నరసింహారెడ్డి మాట్లాడుతూ. ప్రజలు నివాసము ఉండే ప్రాంతాలకు దూరంగా కనీసం ఒక కిలోమీటర్లు దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి మద్యం తాగిన తర్వాత మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించే అవకాశం ఉన్నదని చిన్నపిల్లలపై మద్యం ప్రభావం చూపే అవకాశం ఉంటుందని. యాక్సిడెంట్ జరిగే ప్రమాదం ఉంది చుట్టుపక్కల ఉండే కుటుంబాలకు అసౌకర్యంగా ఉంటుంది అందుకని గ్రామానికి కనీసం కిలోమీటర్ దూరంలో మద్యం షాపులు ఏర్పాటు చేయాలి

అదే సందర్భంలో బెల్టు షాపులను పూర్తిగా నిషేధించాలి బెల్టు షాపుల వల్ల చాలా ప్రమాదం పొంచి ఉంది ఉదయం 6 గంటలకే బెల్టు షాపులలో తాగి భార్యా పిల్లలతో గొడవపడి ప్రాణాలు తీస్తున్నారు ఇతరులను హత్యలు చేసే అవకాశం ఉన్నది. తాగిన మైకంలో దొంగతనాలు చేస్తున్నారు దోపిడీలు చేస్తున్నారు కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి ఎమ్మెల్యేలు,ప్రభుత్వం అధికారులు, సరియైన చర్యలు వెంటనే తీసుకోవాలి అని మీడియాతో మాట్లాడినారు ,

# ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్

- నిర్వహణ ఏర్పాట్లు, సద్వినియోగం చేసుకోవాలి.
- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబర్ 04.**ఈ నెల 15న నిర్వహించే ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్. శిరీష సమక్షంలో సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వేంకటేశ్వర్లు, రామన్నపేట, వలిగొండ, ఎస్ఐలు డి.నాగరాజు, యుగేందర్ గౌడ్, నాగరాజు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేరు చెందిన యువకుడు పాము కాటుతో మృతి...



**పెబ్బేరు నవంబర్04 (సి కే న్యూస్)**పాము కాటుతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాద ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం అంబేద్కర్ కాలనీలో మంగళవారం చోటుచేసుకంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు పట్టణానికి చెందిన పకీరయ్య కుమారుడు గంధం రవి(19) సోమవారం రాత్రి తన వరి పొలానికి నీళ్లు పెట్టి వస్తుండగా పాము కాటుకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా..మెరుగైన వైద్యం కోసం మహబూబ్ నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ గంధం రవి మృతి చెందాడని వైద్యులు తెలిపారు. యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడి మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు







- సభలో మాట్లాడుతున్న మడిపల్లి గోపాల్ రావు
- సామినేని రామారావు హంతకులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అండ ఉంది
- రామారావు హత్యను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం
- కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్న పోలీసులు
- తదనంతర పరిణామాలకు బాధ్యత పోలీసులదే
- పోలీసులు మీకు చేతకాకపోతే మాకు వదిలేయండి, పట్టుకుంటాం..
- సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**

మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన సిపిఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావుని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హత్య చేయించారని తాము ఏనాడు అనలేదని, కానీ తమకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అండ ఉందని కాంగ్రెస్ నాయకులే ప్రచారం చేసుకుంటున్నారని సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు అన్నారు. సామినేని రామారావు హత్యకు నిరసనగా మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. చింతకాని చివర నుంచి గ్రామ ప్రధాన వీధుల గుండా స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు నిరసన సాగింది. అక్కడ బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత నిరసన ప్రదర్శన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. చింతకాని బస్టాండ్ సెంటర్లో జరిగిన బహిరంగ సభలో మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ సామినేని రామారావు హత్య జరిగి నేటికీ ఐదు రోజులు అవుతున్న పోలీసులు విచారణలో ఎటువంటి పురోగతి లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. రామారావుని పాతర్లపాడు కాంగ్రెస్ గుండాలు అత్యంత పాచవికంగా, దుర్మార్గంగా హత్య చేశారన్నారు. సామినేని రామారావుది రాజకీయ హత్య కాదని కాంగ్రెస్ నాయకులు పదేపదే ఆరోపణలు చేయటంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పాతర్లపాడులో కాంగ్రెస్ గెలవదని నిర్ధారణ కావడంతోనే రామారావుని కాంగ్రెస్ గూండాలు హత్య చేశారన్నారు. దసరా సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు గ్రామము నుంచి భారీ సంఖ్యలో జనం రావటంతో కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేకపోయారని అందులో భాగంగానే రామారావుని హత్య చేశారన్నారు. సిపిఎం నాయకులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించటాన్ని తీవ్రంగా ఖండించారు. మతిభ్రమించే మాట్లాడుతున్నది మేము కాదు కాంగ్రెస్ నాయకులేనని, అందుకు పదేపదే తప్పుడు ప్రచారం చేయడమే నిదర్శనం అన్నారు. రామారావు హంతకులను కాపాడేందుకే కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారానికి దిగారన్నారు. రామారావు హత్య జరిగి ఐదు రోజులు అవుతున్న పోలీసులు ఎందుకు నిందితులను అరెస్టు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులోనే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి అన్నారు. పదేపదే తప్పుడు ప్రచారం చేస్తే హత్య పక్కదారిని పట్టించవచ్చునని ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకులు రామారావుపై దిగజారి తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇతర ప్రాంతాలలో హత్యలు జరగలేదా, అక్కడ హత్యలు ఎందుకు జరిగాయి అంటూ కాంగ్రెస్ నాయకులు లేవనెత్తుతున్నారంటే రామారావు హత్యను పరోక్షంగా తామే చేశామని కాంగ్రెస్ నాయకులు ఒప్పుకుంటున్నారన్నారు. పోలీసులకు రెండు మూడు రోజులు గడువు ఇస్తున్నాం, ఈ గడువులో రామారావు హంతకులను అరెస్టు చేయకపోతే తదనంతరం జరిగే పరిణామాలకు పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని లేకపోతే జరిగే పరిణామాలకు బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాచబంటి రాము వత్సవాయి జానకి రాములు గడ్డం కోటేశ్వరరావు ఆలస్యం రవి బల్లి వీరయ్య తోటకూరి వెంకట నరసయ్య యజ్ఞ నారాయణ దొడ్డ చందరావు నక్కన బోయిన శాంతారావు దేశ బోయిన ఉపేందర్ షేక్ మౌలా మాదినేని రవి కాటబత్తిని వీరబాబు ఓబీనబోయిన అచ్చయ్య బయ్య శ్రీను బాలాజీ రామకోటయ్య రామలింగం నమ్మక కృష్ణమూర్తి మడుపల్లి కిరణ్ జల్లే పుల్లయ్య అన్ని గ్రామాల శాఖ కార్యదర్శులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# వలిగొండ మండల పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలకు వివాహా ఆహ్వాన పత్రిక అందజేసిన ఎమ్మెల్యే కుంభం.







**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు నవంబరు 4.**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు మండల పార్టీ నాయకులను స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వలిగొండలో ఆయన నివాసంలో ఆయన కుమారుడు కుంభం శ్రీరామ్ రెడ్డి వివాహానికి హాజరుకావాలని వివాహ ఆహ్వాన పత్రిక అందజేసినారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ డిసిసి ఉపాధ్యక్షులు వాకిటీ అనంతరెడ్డి మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి పట్టణ అధ్యక్షులు కనుకల కిష్టయ్య మండల నాయకులు జక్కజంగారెడ్డి బద్దం సంజీవరెడ్డి పలుసం సతీష్ గౌడ్ బోల్లా శ్రీనివాస్ మండల యూత్ సభ్యులు మైసొల్లా ప్రవీణ్ బత్తిని వరుణ్ బత్తిని నాగేష్ మైపాల్ మండల పరిధిలోని యూత్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# గొర్రెల దొంగల వెంటనే పట్టుకొని బాధితులకు భరోసా కల్పించాలి

DCP ఆకాంక్ష్ కు GMPS జిల్లా కమిటీ విజ్ఞప్తి


**సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :** అక్టోబర్ 4:జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న గొర్రెల దొంగలను వెంటనే గుర్తించి బాధితులకు భరోసా కల్పించాలని %+వీూ% జిల్లా ప్రధాన కార్యదర్శి దయ్యాల నర్సింహ్మ భువనగిరి డిసిపి ఆకాంక్ష్ యాదవ్ ను కోరారు. మంగళవారం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ విచారణ వేగవంతం చేసి నిందితులను త్వరగా గుర్తించి చట్ట పరిధిలో కఠినంగా శిక్షించి వృత్తిదారులకు నష్ట పరిహారం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల కాలంలో జిల్లాలోని భువనగిరి,బీబీనగర్, పోచంపల్లి మండలాలలో జరిగే వరుసగా జరుగుతున్న గొర్రెల దొంగతనాలను చూసి గొల్ల కురుమలు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడపర్తిలో మేడబోయిన బాలయ్య మందలో అక్టోబర్ 28న 50గొర్రెలను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయారని,గొల్లగూడెం గ్రామ పంచాయతీ పరిధి నీలంబావి,రాయరావుపేట ప్రాంతాలలో సుమారు 47 గొర్రెలు,1పొట్టేలు,3 మేకలు దోపిడీకి గురయ్యాయని ఇట్టి విషయాన్ని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి నెల రోజులు దాటినా ఎటువంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయరావుపేట, వడపర్తిలో జీవాలను ఎత్తుకెళ్ళిన వ్యక్తులు,నాలుగు చక్రాల వాహనం సిసి పుటేజీలో నమోదైన వీడియోలను బాధితులు పోలీసులకు చూపెట్టినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ నగరం పరిసర ప్రాంతాలలో జీవాల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి వీటిని అరికట్టేందుకు రాత్రిపూట పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహ్మ, అధ్యక్షులు మద్దెపురం రాజు,ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం,సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం,రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్లంల సత్యనారాయణ,జిల్లా కమిటీ సభ్యులు క్యాసాని న వీన్,బీమగోని బాలరాజు,నరాముల గణేష్,బుగ్గ లక్ష్మయ్య,బాధితులు మేడబోయిన బాలయ్య, మన్నెబోయిన రాములు పాల్గొన్నారు.



# మధిరలో ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభోత్సవం..

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మధిర మెయిన్ రోడ్డు లక్ష్మి మెడికల్ ఎదురుగా ఏ ఎన్ బి కాంప్లెక్స్ లో ప్రెస్ క్లబ్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవ వేడుక జరగనున్నది.

మధిర నియోజకవర్గ కేంద్రంలో గత 20 సంవత్సరాల లో మరెన్నడు లేని విధంగా నూతన వరవడితో జర్నలిస్టులందరూ ఐక్యంగా ప్రజల సమస్యలు పరిష్కారానికి ఒక వేదికగా జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండేందుకు మధిర మెయిన్ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నాళ్ల శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు తమ్మారపు బ్రహ్మం ఆధ్వర్యంలో మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయం ఏర్పాటు చేయటం జరుగుతుంది. మధిర ప్రాంత ప్రజలకు మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జీవి అరుణ్ మరియు ప్రెస్ క్లబ్ సభ్యులు ఒక ప్రకటనలో తెలియజేశారు.



## కరాటేలో రాష్ట్ర స్థాయి పోటీలో ఎంపిక.....



**పెబ్బేరు నవంబర్04 (సి కే న్యూస్)**మహబూబ్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లా ఎస్ జిఎఫ్ స్కూల్ గ్రేమ్స్ కరాటే పోటీలో పెబ్బేరుకు చెందిన విద్యార్థులు గెలుపొందారని మంగళవారం కరాటే మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ జిల్లాలో ఎంపికైన వారికి ఉమ్మడి జిల్లాలో పోటీలు నిర్వహించినట్లు అండర్ 17 లో మేఘన పవన్ గెలుపొందినట్లు తెలిపారు. ఈ విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కరాటే మాస్టర్ తెలిపారు.వీరిని పలువురు అభినందించారు.ద

## సిపిఐ పార్టీ 100 వందేళ్ల పండుగ



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**సిపిఐ పార్టీ 100 వసంతాల పండగ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంలో జరిగే మహా ప్రదర్శన భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుకుంటూ భారత కమ్యూనిస్టు పార్టీ ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి నిధి వసూలు భాగంగా సాయంత్రం చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు సిపిఐ మండల నాయకులు మండె కృష్ణయ్య సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి మండె వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారుద

## ఎడవల్లి గ్రామంలో కొత్త 33,/11 కె.వి విద్యుత్తు ఉప కేంద్రానికి స్థలాన్ని పరిశీలించిన విద్యుత్ శాఖ అధికారులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ముదిగొండ మండల పరిధిలోని ఎడవల్లి గ్రామంలో కొత్త 33/11 కే.వి. విద్యుత్ ఉపకేంద్రానికి స్థలం పరిశీలన

స్థానిక సమాచారం ప్రకారం ముదిగొండ మండల పరిధిలోని ఎడవల్లి గ్రామంలో ప్రతిపాదిత 33/11 కే.వి. విద్యుత్ ఉపకేంద్రం (%ాబఎ-్ఫఉశీఅ%) ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా అధికారులు %ఖఎఎ% సివిల్ ఏడి శ్రీనివాసరావు, సివిల్ ఏవి సాంబయ్య, ముదిగొండ ఏడి సత్యనారాయణ, ఏవి రామకృష్ణ, సబ్ ఇంజనీరింగ్ రామ్మోహన్, మధిర నియోజకవర్గం బి బ్లాకు అధ్యక్షులు కందిమల్ల వీరబాబు గారు, దొంతగాని రామయ్య గారు, గుంజులూరి వీరయ్య గారు, పాదర్తి బాబు, గ్రామ పరిసర ప్రాంతాలను సందర్శించి, ఉపకేంద్ర నిర్మాణానికి అనువైన భూమిని గుర్తించారు. ఈ కొత్త ఉపకేంద్రం ఏర్పడిన తర్వాత ఎడవల్లి, ముదిగొండ, చుట్టుపక్కల గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

గ్రామ ప్రజలు ఈ చర్యను స్వాగతిస్తూ, దీని వల్ల సాగు నీటి బోర్లు, గృహ వినియోగం మరియు చిన్న పరిశ్రమలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**అమృత్ 2.0 పథకం కింద జీఎస్ఐ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పనను సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. ఇందుకోసం అవసరమైన ఖచ్చితమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు సమయానికి అందించాలని ఆయన ఆదేశించారు.

మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో డీటీసీపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై మొదటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాస్టర్ ప్లాన్ రూపొందించడం భవిష్యత్ పట్టణాభివృద్ధికి మార్గదర్శకం. అందువల్ల ప్రతి శాఖ ఖచ్చితమైన, తాజా సమాచారాన్ని అందించాలి అని అన్నారు. రెవెన్యూ శాఖ నుంచి లభించే సర్వే నంబర్లు, వాటి పరిధులు, భూమి వినియోగ వివరాలు కీలకమని, అవి మాస్టర్ ప్లాన్‌కు ఆధారంగా ఉంటాయని తెలిపారు.

త్రాగునీటి సరఫరా అంశంపై ప్రజారోగ్య మరియు మిషన్ భగీరథ అధికారుల సమన్వయంతో సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. రోడ్లు, భవనాలు శాఖ అధికారులు ప్రస్తుత రహదారులతో పాటు బైపాస్ రహదారుల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను సూచించాలని ఆదేశించారు. అటవీ, విద్యుత్, రవాణా, రైల్వే, పరిశ్రమలు తదితర శాఖలు తమ పరిధిలోని అన్ని వివరాలను సమగ్రంగా సమర్పించాలన్నారు.

అన్ని ప్రభుత్వ కార్యాలయాల స్థానాలను కూడా మాస్టర్ ప్లాన్‌లో ప్రతిబింబించాలన్నారు. పట్టణ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవడమే కాకుండా, వచ్చే ఇరవై సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాదేశిక వివరాలను సేకరించాలని సూచించారు.

డ్రోన్ టెక్నాలజీ ద్వారా డిజిటల్ మ్యాపింగ్ నిర్వహించి భూ వినియోగ మ్యాపులు రూపొందించవచ్చని, తాజా డేటాను ఆధారంగా చేసుకుని ప్లాన్లను నవీకరించవచ్చని కలెక్టర్ తెలిపారు. సమగ్ర ప్రణాళిక ద్వారా భవిష్యత్ పట్టణాభివృద్ధికి అవసరమైన భూమి వినియోగం, భవన నిర్మాణం, రవాణా మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

జనాభా పెరుగుదల మరియు పట్టణ విస్తరణను దృష్టిలో ఉంచుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా గృహాలు, త్రాగునీరు, రహదారులు మరియు ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రక్రియను ఆర్‌డిఓలు మరియు తహసీల్దార్లు పర్యవేక్షించాలన్నారు.

సమగ్ర సమాచారం ఆధారంగా డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ రూపొందించబడుతుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, ఆర్‌డిఓ మధు,సి పి ఓ సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయండి...

### కలెక్టర్ను కలిసిన చైర్మన్ వీరబాబు, కార్యదర్శి కరుణ కుమారి...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయాభివృద్ధి తో పాటు జిల్లాలో ఉన్న పలు గ్రంథాలయా అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గ్రంథాలయ చైర్మన్ వీరబాబు మంగళవారం కలెక్టర్ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో అనేక మౌలిక సదుపాయాల అవసరం ఉందని, అదే విధంగా జిల్లాలో ఉన్న పలు గ్రంథాలయాల అభివృద్ధికి స్థల సేకరణ అవసరం ఉందని అన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి పర్చడం ద్వారా అనేక మంది పోటీ పరీక్షలకు సిద్ద వడే వారికి, పాఠకులకు ఉపయోగ కరంగా ఉంటుందని ఆ వినతి పత్రంలో కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, గ్రంథాలయాల మౌలిక సదుపాయాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ను కలిసి వారిలో అఫీస్ ఇంచార్జ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

### టూ టౌన్ సీఐ ప్రతాప్.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / చుంచుపల్లి ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం లో ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగనున్న ప్రత్యేక లోక్ అదాలత్‌ను కక్షిదారులు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని టూ టౌన్ సీఐ ప్రతాప్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన సమస్యలు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమవుతాయి,అని తెలిపారు.రాజీయే రాజమార్గం. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దు. న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం లభిస్తుంది,అని సీఐ ప్రతాప్ వివరించారు.




## వైజాగ్, - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులను పూర్తి స్థాయిలో ఆదుకోవాలి ...

● సిపిఎం అప్పలరాజు

**నక్కపల్లి సీ కే న్యూస్ నవంబర్ 4** నక్కపల్లి మండలం వైజాగ్ చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్వాసితులను పూర్తి స్థాయిలో ఆదుకో కుండా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఈనెల పద్నాలుగు, పదిహేను తేదీ లలో శంఖుస్థాపన ఎలా చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్ ప్రశ్నించారు.

మంగళవారం మూలపర్ర లో జరిగిన నిర్వాసితులుతో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అర్హత కలిగిన అందరికీ ప్యాకేజీ ఇవ్వాలని, వివాహ అయిన ఆడపిల్లలు కు భూ సేకరణ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు ప్యాకేజీ ఇవ్వాలి, మూలపర్ర, తుమ్మల పేట, తమ్మయ్యపేట గ్రామాలలో ఇళ్ళు కు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి, నిర్వాసితులు అందరికీ ఆర్ కార్డు లు ఇవ్వాలని, వెంటనే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి ఎంత తొందరగా ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ కు భూములు అప్పగించాలని ఆద్రుత తప్ప భూములు, ఇళ్ళు కోల్పోయి సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ఆదుకోవడానికి చర్యలు చేపట్టకపోవడం నిర్వాసితులను నిలువునా దగా చేయడమే అవుతుంది.

2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం, పునర్నిర్మాణం పూర్తి స్థాయిలో పరిష్కారం చేయకుండా ఎటువంటి పనులు చేపట్టకూడదని తెలియజేస్తున్నా చట్టాన్ని ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు, చట్టాలను అమలు చేయాల్సిన ప్రభుత్వమే నిర్వాసితును మోసం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

నిర్వాసితులను పూర్తి స్థాయిలో ఆదుకో కుండా ఎటువంటి పనులు చేపట్టి కూడదని తెలిపారు.

ఈ కార్యక్రమంలో చంటమ్మ,భవానీ, కళావతి, లలితమ్మ, లక్ష్మి, ముసలమ్మ,అమ్మాజీ,రమణ, అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మరిడిమాంబ జాతర మహోత్సవ పోస్టర్ను ఆవిష్కరించిన మాడుగుల ఎమ్మెల్యే బండారు.

**పరవాడ సీ కే న్యూస్ నవంబర్ 4:** మండలం వెన్నెల పాలెం గ్రామంలో ఈనెల 6 తేదీన భక్తుల పాలిట కొంగుబంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ మేరకు అమ్మవారి జాతరలో నిర్వహించబోయే కార్యక్రమాలకు సంబంధించి ముద్రించిన గోడపత్రికను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు,వెన్నెల అప్పలనాయుడు,వెన్నెల వెంకి నాయుడు,మాజీ ఎంపీటీసీ పైల రతాల సన్యాసిరావు,ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు,వెన్నెల నరసింహారావు,పైల జూనియర్ అప్పలనాయుడు, పైల ప్రసాద్,లోకిరెడ్డి అభినాయుడు,భోజంకి అప్పలనాయుడు,గొంప మారునాయుడు,వెన్నెల వెంకట గిరి,వాసిరెడ్డి ఈశ్వరరావు,బండారు వీరునాయుడు,బండారు సతీష్,పైలా శివశంకర్,వెన్నెల ప్రసాద్,పైల రమణాజీ తదితర స్థానిక నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

## చిత్తడి నేలల గుర్తింపు, పరిరక్షణకు శాఖల సమన్వయం అవసరం.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),నవంబర్ 04,**పర్యావరణ పరిరక్షణ, భూగర్భ జలాల పెరుగుదల, పర్యాటక అభివృద్ధి దృష్ట్యా చిత్తడి నేలల సంరక్షణ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐ.డి.ఓ.సి కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సమావేశం జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న చిత్తడి నేలల గుర్తింపు, భౌగోళిక సరిహద్దుల నిర్ణయం, వాటి పరిరక్షణ, అభివృద్ధి, మరియు సుప్రీం కోర్టు ఆదేశాల అమలుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చ జరిగింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా చిత్తడి నేలల భౌగోళిక గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయడం అత్యవసరం. ఇందుకోసం అటవీ శాఖ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సర్వే విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలి అని తెలిపారు.

“జిల్లాలో ప్రాథమికంగా 50 చెరువులను ఎంపిక చేసి, వాటిపై సమగ్ర సర్వే నిర్వహించాలి. వాటి భౌగోళిక సరిహద్దులను ఖచ్చితంగా నిర్ణయించి, క్షేత్ర ధృవీకరణ చెయ్యాలని ఆదేశించారు . గుర్తించిన చిత్తడి నేలల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు, మానవ జోక్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

“చిత్తడి నేలలు పర్యావరణ సమతుల్యతకు కీలకమైన జీవ వ్యవస్థలు. ఇవి వర్షపు నీటిని నిల్వ ఉంచి భూగర్భ జలాలను పునరుత్పత్తి చేయడంలో, వన్యప్రాణుల నివాస స్థలాలుగా, మరియు పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణంగా పనిచేస్తాయి. అందువల్ల చిత్తడి నేలల స్వరూపాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత” అని అన్నారు.

వెట్ ల్యాండ్ ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో పర్యాటక శాఖతో కలిసి చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, పర్యావరణ అనుకూల ప్రాజెక్టులను రూపొందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి,




జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా పంచాయతీ అధికారి అనూష మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో సీనియర్లు గుస్సా...

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ పూర్తిస్థాయి కేబినెట్ కొలువుదీరలేదు. మొత్తం 18 మంత్రి పదవులు ఉండగా.. మొదటగా 11 మందికి పదవులు ఇచ్చారు. ఆరు నెలలక్రితం మరో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. తాజాగా అజారుద్దీన్‌కు మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కింది. ఇక రెండు పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఆశావహులు మాత్రం ఎక్కువగా ఉన్నారు. దీంతోఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాని అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం ఇప్పుడు కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది. జూబ్లీహిల్స్ ఎన్నికల నేపథ్యంలో అజార్‌ను కేబినెట్‌లోకి తీసుకున్నారు. వ్యూహాత్మక నిర్ణయంగా సమర్థించినా.. సీనియర్ నాయకులు మాత్రం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.మంత్రి పదవి ఆశిస్తున్నవారిలో మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ, నేత ఫిరోజ్ ఖాన్ కూడా ఉన్నారు. వీరు కూడా మైనారిటీ కోటాలో పదవి ఆశించారు. కానీ ఆ ప్లేస్ భర్తీ కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక అంజన్ కుమార్ యాదవ్ జూబ్లీహిల్స్ నుంచి రేసు తప్పుకున్నప్పటికీ, తన కష్టం మర్చిపోయారని అసంతృప్తిగా ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దం పాటు పోరాడి కూడా పక్కనబెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు చర్చ లేకుండా అధిష్టానం నిర్ణయం తీసుకోవడంపై పార్టీలోని చాలా మంది గుర్రుగా ఉన్నారు.అధిష్టానంప్రకారం, మైనారిటీ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వడం అవసరమని భావించి అజారుద్దీన్‌ను ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. అయితే, పార్టీ అంతర్గత వర్గాలు ఈ సాకును ప్రశ్నిస్తున్నాయి. ప్రాతినిత్యం పేరుతో ఓటమి



పొందిన అభ్యర్థికి పదవి ఇవ్వడం ప్రోత్సాహకమా, లేక పార్టీ క్రమశిక్షణకు భంగమా అన్న దానిపై చర్చ మొదలైంది. దీనినినే ఇప్పుడు నేతలంతా తప్పుపడుతున్నారు.ఇక నామినేటెడ్ పోస్టుల విషయంలోను సీనియర్లలోఅసంతృప్తి వ్యక్తమవుతోంది. మధుయాష్కీ గౌడ్, జగ్గారెడ్డి వంటి నేతలు ఎమ్మెల్యేలను తప్ప ఇతరులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది సీనియర్ సభ్యులు మీడియాకు ఆఫ్ద రికార్డ్‌గా, పార్టీ జూబ్లీహిల్స్‌లో ఓడిపోవడం అజారుద్దీన్ వైరివిధానం అని గుసగుసలాడుతున్నారు. ఈ వివాదం రాష్ట్ర కాంగ్రెస్‌లో కొత్త శక్తి సమీకరణలకు తెరతీసే అవకాశముందని భావిస్తున్నారు.మొత్తంగా అజార్ మంత్రిపదవి మరోసారి కాంగ్రెస్‌లో సీనియర్%-%యువ వర్గాల మధ్య చిచ్చు పెట్టింది. అధిష్టానం ఎలాంటి సమీక్ష చేపట్టి అసంతృప్తులను చక్కదిద్దుతుందనే దానిపైనే పార్టీ అంతర్గత ఐక్యత ఆధారపడి ఉంటుంది.

# కోకాపేటలో మళ్లీ భూముల వేలం




హెచ్ఎండీఏ భూముల అమ్మకాలకు మంచి స్పందన వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరిన్ని స్థలాలను వేలం వేయడానికి సిద్ధమవుతోంది. కోకాపేట, కూకట్‌పల్లిలో 47 ఎకరాల భూమిని వేలం వేయడానికిప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కోకాపేటలో ఎకరా ప్రారంభ ధర రూ.99 కోట్లు, కూకట్‌పల్లిలో రూ.75 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.4,000 కోట్లు సమకూరేఅవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉంది.హెచ్ఎండీఏ పరిధిలోని స్థలాల అమ్మకాలకు.. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. దీంతో మరిన్ని స్థలాలను వేలం వేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా కోకాపేట, కూకట్‌పల్లి ప్రాంతాల్లో హెచ్ఎండీఏ భూములు వేలం వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇంతకుమందు కోకాపేటలో భూముల వేలానికి అనూహ్యస్పందన వచ్చింది. ఎకరం రికార్డు స్థాయిలో ధర పలికిన విషయం తెలిసిందే. త్వరలో వేలం వేసే స్థలాలు ఎంత ధర పలుకుతాయి అన్న విషయంపై ఆసక్తి నెలకొంది.హైదరాబాద్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాలైన కోకాపేటలోని నియోపోలీస్, కూకట్‌పల్లి పరిధిలో ఉన్న మూసాపేట వై జంక్షన్ వద్ద భూముల అమ్మకానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాంతాల్లో మొత్తం 47 ఎకరాల భూమిని వేలంవేయనున్నట్లు తెలుస్తోంది. కోకాపేట నియో పోలీస్‌లో 32 ఎకరాలు, కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద 15 ఎకరాల భూమి అమ్మకానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది.కోకాపేట నియోపోలీస్‌లో ఎకరా ప్రారంభ ధర రూ.99 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. ఇక కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఎకరా ప్రారంభ ధర రూ. 75 కోట్లుగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భూముల వేలం ద్వారా దాదాపు రూ. 4,000 కోట్లు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో జరిగే ఈ వేలం పాటను నవంబర్ 24, 28.. డిసెంబర్ 3, 5 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది.కోకాపేటలోని నియోపోలిస్‌లో 25ఎకరాల భూమిని వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమవుతున్నట్లు.. దీని ద్వారా రూ.3 వేల కోట్ల ఆదాయం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పుడు 32 ఎకరాలు వేలంవేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై హెచ్ఎండీఏ స్పష్టత ఇవ్వాల్సి ఉంది. 2022లో కోకాపేట నియోపోలీస్‌లో జరిగిన వేలంలో ఎకరా రూ.100.75 కోట్లు పలికి రికార్డు సృష్టించింది. ఒకవేళ ఈసారి వేలం జరిగితే కూడా భారీ స్పందన ఉంటుందని అంచనాలు ఉన్నాయి.మరోవైపు, గత నెలలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించింది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన రాయదుర్గంలో..తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) నిర్వహించిన వేలంలో ఎకరం భూమికి రికార్డు స్థాయిలో రూ.177 కోట్లకు అమ్ముడుపోయింది. ఇది రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు నిర్వహించిన వేలాల్లోనేఅత్యధిక ధర కావడం

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం

## కూలీలకు రూ.600, విద్యార్థులకు రోజుకు రూ.1000

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంతో దినసరి కూలీల అడ్డాలు ఖాళీగా మారాయి. రాజకీయ పార్టీలు ప్రచారానికి, పోస్టర్ల అంటించడానికి దినసరి కూలీలను వినియోగించుకుంటున్నాయి. రోజుకు రూ. 400-800 వరకుచెల్లిస్తూ, భోజనం కూడా పెడుతుండటంతో కూలీలు ఎన్నికల ప్రచారానికే మొగ్గు చూపుతున్నారు. విద్యార్థులకు కూడా ఇంటింటి ప్రచారం, ఓటర్ల జాబితా పరిశీలన పనులకు గాను రూ. 1000 చొప్పున చెల్లిస్తున్నారు.దీంతో విద్యార్థులు, దినసరి కూలీలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికకు సమయం దగ్గర పడుతోంది. దీంతో పార్టీలన్ని ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచాయి. ఇంటింటికి తిరిగిప్రచారం చేయడం.. సభలు, సమావేశాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో అన్ని పార్టీల నేతలు ఫుల్లు బిజీగా ఉన్నారు. ఉప ఎన్నిక నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కార్మికుల అడ్డాలువెలవెలబోతున్నాయి. మొన్నటి వరకు ఉదయం 8 గంటల కల్లా కూలీలతో రద్దీగా ఉండే పలు ప్రాంతాలు.. గత కొన్ని రోజులుగా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే..సాధారణ రోజుల్లో ఇక్కడ ఉదయం 8 గంటల వరకే కూలీలు వచ్చి.. పని ఇచ్చే వారి కోసం ఎదురు చూసేవారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమాలు మొదలైన నాటి నుంచి పరిస్థితి మారింది. అడ్డాల మీద కూలీలే కనిపించడం లేదు. కారణం.. రాజకీయపార్టీలు ప్రచార కార్యక్రమాల కోసం దినసరి కూలీలను వినియోగించుకోవడం. ఎన్నికల ప్రచారానికి వెళ్లే నాయకుల వెంట పెద్ద సంఖ్యలో జనాలు ఉండేలా పార్టీలు శ్రద్ధ పెడుతున్నాయి. అలానే పార్టీలు జెండాలు మోయడం




కోసం.. పోస్టర్లు అంటిచే పనికి కూడా జనాలు అవసరం. వీటన్నింటి కోసం పార్టీలు దినసరి కూలీలను వినియోగించుకుంటున్నాయి. పైగా వారికి కూలీ డబ్బుతోపాటు భోజనం కూడా పెడుతుండటంతో..చాలా మందికూలీలు అడ్డాల దగ్గరకు వెళ్లకుండా నేరుగా పార్టీ కార్యాలయాలకే వెళ్లిపోతున్నారు.ఉప ఎన్నిక నేపథ్యంలో.. నియోజకవర్గంలోప్రతి రోజు రెండు పూటలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉదయం,సాయంత్రం ప్రచారానికి వచ్చిన వారికి రూ.400 నుంచి రూ.600 వరకు ఇస్తున్నారు. అలానే ఒక పూట ప్రచారంలో పాల్గొంటే రూ.200-రూ.300 వరకు కూలీ ఇస్తున్నారు. ఓ పార్టీ అభ్యర్థి అయితే ఏకంగా రోజుకురూ.800 కూడా ఇస్తున్నట్టు తెలిసింది. అభ్యర్థి, పార్టీ నేతలు ప్రచార సమయంలో తమ వెంట 100 మందికి తగ్గకుండా జనం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. కష్టపడి పని చేసే అవసరం లేకుండా.. ఇటు డబ్బుకి డబ్బు,అటు కడుపు నిండా భోజనం లభిస్తుండడంతో కూలీలూ ప్రచార పనికే మొగ్గు చూపుతున్నారు.దినసరి

కూలీలను మాత్రమే కాక.. విద్యార్థులను కూడా ప్రచార కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు.
ఇంటర్, డిగ్రీ విద్యార్థులనుకు పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ లిస్ట్ ఇచ్చి ఇంటింటికి పంపి.. పరిశీలన చేసే పనిని అప్పగిస్తున్నాయి పార్టీలు. దీనిలో భాగంగా విద్యార్థులు తమకు కేటాయించిన బూత్‌లో ఉన్న ప్రతి ఇంటికివెళ్లి.. అక్కడ ఓటర్ ఉన్నాడా లేదా అని చెక్ చేసి.. వారి పేరుపై టిక్ చేసుకుంటున్నారు. అలానే మొబైల్ నంబర్ కూడా తీసుకుంటున్నారు. ఇందుకు గాను విద్యార్థులకు రోజుకు రూ.1000 చొప్పున పార్టీలుచెల్లిస్తున్నాయి.

# 9 నుంచి ఉద్యోగుల సమ్మెఆందోళన బాట

టీచర్లు, ప్రభుత్వ పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులు తమ హక్కులు, బకాయిలు, పీఆర్సీ సాధించుకునేందుకు పోరుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం తమకిచ్చిన హామీలను తుంగలో తొక్కిందని, తమ డిమాండ్ల సాధనకు ఇక ఉద్యమ బాటే సరైనదని భావిస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే పోరు తప్పదని ఉపాధ్యాయ సంఘాల్లో ఒకటైన తెలంగాణ పీఆర్టీయూ ఇప్పటికే అల్టిమేటం జారీ చేసింది.అందుకు డిసెంబర్ 9వ తేదీని డెడ్‌లైన్ విధించింది. ఈహెచ్ఎస్ స్కీం అమలు చేయాలనే డిమాం డ్‌తో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఈనెల 11న అన్ని జిల్లాలో నిరాహార దీక్షలు చేపట్టనుంది. అలాగే పెన్ష నర్ల జేఏసీ సైతం తమ బెనిఫిట్స్ సాధ న కోసం పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులతో కలిసి 17న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నది.కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత ఎన్షన్ విధానాన్ని అమలు చేయాలని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) 25న 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చింది. అదే బాటలో మరికొన్ని టీచర్ సంఘాలు ఉద్యమ బాట పట్టనున్నాయి. వీరి నిరసనలు, దీక్షలతో నవంబర్, డిసెంబర్ మాసాలు హోరెత్తనున్నాయి.కేంద్ర ప్రభుత్వం ఒకవైపు 8వ పే కమిషన్ ప్రకటించి కేంద్ర ప్రభుత్వఉద్యోగులకు తీపికబురు అందిస్తుంటే, రాష్ట్రప్రభుత్వం మాత్రం తమకు మొండిచేయే చూపిస్తుందని ఉద్యోగులు, టీచర్లు వాపోతున్నారు. డీఏ బకాయిలు 2022 జూలై నుంచి (ఐదు డీఏలు) పెండింగ్‌లో ఉన్నాయని, అసలు పీఆర్సీ ఊసే ఎత్తడం లేదని మండిపడుతున్నారు. కనీసం దసరాకో, దీపావళికో ఒక డీఏ అయినా ఇవ్వాలని కోరినా స్పందన లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలో కి వచ్చిన ఆరు నెలల్లో పీఆర్సీ ప్రకటిస్తామన్న కాంగ్రెస్ ఇప్పటివరకు దాని ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పాత పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లవుతోంది. ఇప్పటివరకు కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి అప్పగించలేదు. ఉద్యోగుల డిమాండ్ మేరకు ప్రభుత్వం 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలంటే రూ.10 వేల కోట్లు అవసరం. అలాగే రెండు డీఏలు ఇవ్వాలంటే కనీసం రూ.300 కోట్లు సమీకరించాల్సి ఉంది. రాష్ట్రప్రభుత్వం గతనెలలో ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.721 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేసింది. ఈనెలలోనూ మరికొంత చెల్లించాల్సి ఉంది.అదెప్పుడు విడుదలవుతుందో తెలియదు. అలాగే ఈహెచ్ఎస్ పథకం కింద ఆరోగ్య కార్డుల జారీ ఎప్పుడు జారీ అవుతాయో తెలియడం లేదు. కార్డుల్లేకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు ప్రస్తుతం వైద్యఖర్చులు సొంతంగా పెట్టుకుంటున్నారు. అలాగే సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ స్కీంను అమలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన ప్రభుత్వం, ఆ హామీని నెరవేర్చాలని కోరుతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈనెల 25న ఎన్ఓంపీఎస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరుగనున్నది.

# జిల్లా ఎస్పీ జన్మదిన వేడుకలు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలూరు పోలవరం నూజివీడు సబ్ డివిజన్లకు చెందిన పోలీసు అధికారులు సిబ్బంది జిల్లా ఎస్పీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఏలూరుజిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏలూరు పోలవరం నూజివీడు సబ్ డివిజన్లకు చెందిన పోలీసు అధికారులు సిబ్బంది జిల్లా ఎస్పీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఆయనతో కేక్ కట్ చేయించారు.ఏలూరు డీఎస్పీ శ్రావణకుమార్, నూజివీడు డీఎస్పీ ప్రసాద్రావు, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, సిఐలు సుబ్బారావు అశోక్ కుమార్ ,కోటేశ్వరరావు, సత్యనారాయణ, మల్లేశ్వరరావు ఎస్ఐలు సిబ్బందిపాల్గొన్నారుజి


# వర్షార్పణం అయిన పంట

:యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద చెరువు నిండి అలుగు వెళ్లడంతో అలుగునీరు ఇండ్లలోకి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న 13 వ వార్డు వినాయక నగర్ కాలనీవాసులు..... గత నాలుగు రోజులుగా ఇండ్ల చుట్టూ నీరు చేరడం తో బయటికి రాని పరిస్థితిలో ఉండగా అధికారులు స్పందించక పోవడంతో తమ సొంత నిధులతో అలుగు వెళ్లే కాలువను వెడల్పు చేసి నీరు వెళ్లే విధంగా చేస్తున్నారు.... గత పాలకుల నిర్లక్ష్యమే తమ కాలనీ లోకి నీరు వస్తున్నాయని డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం కారణంతోనే తమ ఇండ్లు మునుగుతున్నాయని, వరద నీటి లో విష సర్పాలు వస్తున్నాయని, ఇప్పటికైనా పాలకులు చౌటుప్పల్ అలుగు వెళ్లే కాలువను పెద్దగా చేయాలని కోరుతున్నారు.

# బైక్ నడుపుతున్న మైనర్ బాలుడికి "క్లాస్ ఇచ్చిన ఆర్డీఓ కె.మాధురి

ఆర్డీవో కె మాధురి బైక్ నడుపుతున్న మైనర్ బాలుడిని మందలించారు. తిరువూరు ఆర్డీఓ మాధురి కు బైక్ వేగంగా నడుపుతూ తోటమూల గ్రామంలో అమెకు బాలుడు తారస పడ్డాడు. వెంటనే తనకారు ఆపి బాలుడివివరాలు సేకరించి మైనర్లు వాహనాలు నడపడం వలన జరిగే పరిమాణాలు వివరించారు. తెలిసి తెలియని డ్రైవింగ్ తో జరిగే మైనర్ ప్రమాదాలను సూచించారు. వెంటనే తల్లితండ్రులకు పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలనితహసిల్దార్ ను ఆదేశించారు. అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు మైనర్ల వాహనాల ఇవ్వడం వలన జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు.

# రోజూ ఒక నారింజ పండును తప్పనిసరిగా తినాల్సిందే..



నారింజ పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. చలికాలం సీజన్ లో ఇవి మనకు మార్కెట్‌లో ఎక్కువగా దర్శనమిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అత్యధిక మొత్తంలో లభించే పండ్లలో నారింజ పండు కూడా ఒకటి. నారింజ పండ్లను అనేక రకాలుగా తీసుకోవచ్చు. వీటిని నేరుగా అలాగే తినవచ్చు. లేదా జ్యూస్ చేసి తాగవచ్చు. ఇతర పండ్లతో కలిపి సలాడ్ రూపంలోనూ తినవచ్చు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి నారింజ పండ్లను తినాలని వైద్యులు చెబుతుంటారు. ఈ పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. రోజూ కచ్చితంగా ఒక నారింజ పండును తినాలని, దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు సైతం సూచిస్తున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరు ఈ పండ్లను కచ్చితంగా రోజూ తినాలని వారు చెబుతున్నారు.



**విటమిన్ సి..**


నారింజ పండ్లలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. విటమిన్ సి అధికంగా లభించే పండ్లలో నారింజ పండు ముందు వరుసలో నిలుస్తుంది. ఒక మీడియం సైజు నారింజ పండును తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. విటమిన్ సి వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు తగ్గుతాయి. విటమిన్ సి వల్ల చర్మానికి సైతం ఎంతో మేలు జరుగుతుంది. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. విటమిన్ సి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. దీని వల్ల పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..**

నారింజ పండ్లను తినడం వల్ల విటమిన్ బి6 అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఎర్ర రక్త కణాలు వృద్ధి చెందుతాయి. రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. అలాగే శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి నారింజ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. రోజూ ఒక నారింజ పండును తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ పండ్లను తింటుంటే కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. నారింజ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణశక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. మలబద్దకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**డయాబెటిస్ ఉన్నవారు కూడా..**

డయాబెటిస్ ఉన్నవారు సైతం నారింజ పండ్లను తినవచ్చు. ఇందులో భయం చెందాల్సిన పనిలేదు. నారింజ పండ్లను తింటే షుగర్ పెరుగుతుందని అనుకుంటారు. కానీ ఇది అపోహే. ఇందులో నిజం లేదు. ఎందుకంటే నారింజ పండు గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ 40గా ఉంటుంది. అందువల్ల ఈ పండును తింటే షుగర్ లెవల్స్ అమాంతం పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా నిరభ్యంతరంగా ఈ పండ్లను రోజూ తినవచ్చు. ఇందులో సందేహించాల్సిన పనిలేదు. ఇక ఈ పండ్లలో సిట్రేట్స్ అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీల్లో స్టోన్లు ఏర్పడకుండా చూస్తాయి. అందువల్ల కిడ్నీ స్టోన్లు ఉన్నవారికి మేలు జరుగుతుంది. అలాగే మూత్రం పీహెచ్ స్థాయిలు సరైన రీతిలో ఉంటాయి. దీని వల్ల మూత్రాశయం, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నారింజ పండును రోజుకు ఒకటి చొప్పున తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.



# రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేస్తే..
## ఎన్ని అద్భుతమైన లాభాలు కలుగుతాయో తెలుసా..?

ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ వ్యాయామం చేయాలన్న విషయం అందరికీ తెలిసిందే. ఒకప్పుడు ప్రజలు శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు. రోజూ ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేవారు. దీంతో వారికి చక్కని వ్యాయామం జరిగేది. దీని వల్ల వారు ఆరోగ్యంగా ఉండేవారు. వృద్ధాప్యం వచ్చినా శారీరక దారుఢ్యం ఉండేది. కానీ ప్రస్తుతం యుక్త వయస్సులోనే అన్ని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం వ్యాయామం లేదా శారీరక శ్రమ లేకపోవడమే అని చెప్పవచ్చు. కనుక ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాల్సి ఉంటుంది. అయితే మనకు అనేక రకాల వ్యాయామాలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చాలా మంది తమకు సౌకర్యవంతంగా ఉండే వ్యాయామాలను చేస్తుంటారు. ఇక అలాంటి వ్యాయామాల్లో స్కిప్పింగ్ కూడా ఒకటి. దీన్నే రోప్ జంపింగ్ లేదా స్కిప్పింగ్ రోప్స్ అని కూడా పిలుస్తారు. ఈ వ్యాయామాన్ని చాలా మంది చేస్తుంటారు. అయితే దీన్ని రోజూ చేయడం వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి.

**గుండెకు చక్కని వ్యాయామం..**

స్కిప్పింగ్ ను రోజూ కనీసం 30 నిమిషాల పాటు చేస్తే ఎన్నో లాభాలు ఉంటాయని ఫిట్ నెస్ నిపుణులు చెబుతున్నారు. అయితే స్కిప్పింగ్ అసలు అలవాటు లేని వారు రోజుకు 30 నిమిషాలు చేయడం కష్టం అవుతుంది. కనుక ముందుగా 5 నిమిషాలతో ప్రారంభించాలి. క్రమంగా ఆ సమయాన్ని పెంచుతూ పోవాలి. దీని వల్ల రోజూ 30 నిమిషాల పాటు స్కిప్పింగ్ చేసే సామర్థ్యం వస్తుంది. ఇలా ఈ వ్యాయామం చేస్తే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. స్కిప్పింగ్ వల్ల గుండెకు చక్కని వ్యాయామం అవుతుంది. దీన్ని అత్యుత్తమ, ఖర్చు లేని కార్డియో వ్యాయామంగా చెప్పవచ్చు. దీని వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తం, ఆక్సిజన్ సరఫరా సక్రమంగా అవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

**కొవ్వు కరుగుతుంది..**

స్కిప్పింగ్ వల్ల శ్వాసకోశ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కార్బన్ డయాక్సైడ్ సులభంగా బయటకు వెళ్లిపోతుంది. స్కిప్పింగ్ చేయడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు చక్కని వ్యాయామం అవుతుంది. ముఖ్యంగా పొట్ట, తొడలు, పిరుదులకు చక్కని వ్యాయామం అవుతుంది. దీంతో ఆయా భాగాల్లో ఉండే కొవ్వు కరుగుతుంది. శరీరం సన్నగా నాజూగ్గా మారుతుంది. కండరాలు దృఢంగా మారి చక్కని దేహ దారుఢ్యం సొంతమవుతుంది. శరీరంలో శక్తి సామర్థ్యాలు పెరుగుతాయి. యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. నీరసం, అలసట ఉండవు. బద్ద కం పోతుంది. ఈ వ్యాయామం చేయడం వల్ల శరీరం లోని కొవ్వు సులభంగా కరిగిపోతుంది. రోజూ 30 నిమి షాల పాటు స్కిప్పింగ్ చేస్తే శరీరం సుమారుగా 300 క్యాలరీల వరకు శక్తిని ఖర్చు చేస్తుంది. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. అధిక బరువు సులభంగా తగ్గుతారు.

**ఎముకల ఆరోగ్యానికి..**

స్కిప్పింగ్ చేయడం వల్ల చర్మం సైతం సురక్షితంగా ఉంటుంది. చర్మానికి రక్త సరఫరా పెరుగుతుంది. పోషకాలు లభిస్తాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. చర్మం శుభ్రంగా మారుతుంది. ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. సాధారణంగా వయస్సు మీద పడే కొద్దీ ఎముకలు బలహీనంగా మారుతాయి. దీనికి క్యాల్షియం లోపం తోడైతే ఎముకలు పెళుసుగా మారి త్వరగా విరిగిపోయేందుకు అవకాశాలు ఉంటాయి. అయితే రోజూ స్కిప్పింగ్ చేస్తే వృద్ధాప్యంలో ఎముకల సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు తమ పరిశోధనల్లో తేల్చారు. స్కిప్పింగ్ చేయడం వల్ల వృద్ధాప్యంలో ఎముకలు చాలా బలంగా మారుతాయి. ఇలా ఈ వ్యాయామం మనకు ఎంతో మేలు చేస్తుంది. కనుక రోజూ స్కిప్పింగ్ చేయడం మరిచిపోకండి.

# అధిక బరువుతో అవస్థలు పడుతున్నారా..?
## అయితే ఈ పండ్లను రోజూ తినండి, ఎంతో మేలు జరుగుతుంది..!

ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.



**బెర్రీలు, యాపిల్..**

అధిక బరువు తగ్గేందుకు గాను బెర్రీ పండ్లు ఎంతో దోహదం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతో సహాయం చేస్తుంది. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు సైతం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే రాదు అని అంటుంటారు. ఆ ప్రకారమే రోజూ ఒక యాపిల్ పండును తింటుంటే శరీరంలోని కొవ్వును కరిగించుకుని అధిక బరువును తగ్గించుకోవచ్చు. బరువు తగ్గేలా చేయడంలో యాపిల్స్ ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో ఉండే ఫైబర్ బరువును నియంత్రణలో ఉంచుతుంది.

**గ్రేప్ ఫ్రూట్, పుచ్చకాయలు..**

అధిక బరువు సమస్యతో బాధపడుతున్నవారికి గ్రేప్ ఫ్రూట్ కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే బరువు తగ్గేందుకు అవకాశాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఈ పండ్లలో అధికంగా ఉండే విటమిన్లు సి, ఎ బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. పుచ్చకాయలు మనకు కేవలం వేసవిలోనే కాదు, ప్రస్తుతం అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటున్నాయి. అందువల్ల పుచ్చకాయలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఈ పండ్లను తింటే కడుపు నిండిన భావన కలిగి ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తినేలా చేస్తాయి. దీని వల్ల బరువు తగ్గడం తేలికవుతుంది.

**పియర్స్, కివి, అవకాడో..**

పియర్స్ పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకున్నా కూడా మేలు జరుగుతుంది. ఈ పండ్లు కూడా బరువును తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. ఈ పండ్లలోనూ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. బరువు తగ్గేలా చేస్తుంది. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూస్తుంది. రోజూ ఒక కివి పండును తింటున్నా కూడా ఎంతో ఉపయోగం ఉంటుంది. కివి పండ్లను తింటే ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి ఉండదు. శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చూసుకోవచ్చు. దీని వల్ల అధిక బరువు తగ్గుతారు. రోజూ ఒక అవకాడోను తింటున్నా కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఈ పండ్లలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండెను ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా బరువు తగ్గేందుకు కూడా దోహదం చేస్తాయి. ఇలా ఆయా రకాల పండ్లను తరచూ తింటుంటే అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు. ప్రస్తుతం చాలా మంది అధిక బరువు సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. శరీరంలో అధికంగా చేరిన కొవ్వును కరిగించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అధికంగా బరువు పెరిగేందుకు అనేక కారణాలు ఉంటాయి. శారీరక శ్రమ లేకపోవడం,

గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం, వేళకు భోజనం చేయకపోవడం, అతిగా తినడం, జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక అనారోగ్యాలు ఉండడం వంటివి అధికంగా బరువు పెరిగేలా చేస్తాయి. బరువు అధికంగా ఉన్నవారు కచ్చితంగా తగిన జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. రోజూ వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. తగినన్ని గంటలపాటు నిద్రించాలి. జంక్ ఫుడ్ తినడం తగ్గించాలి. అలాగే ఆహారం విషయంలో అనేక మార్పులు చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను తింటుండాలి. దీని వల్ల శరీరంలోని కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.

# సర్జరీ గురించి శ్రుతి హాసన్ నిజం చెప్తే..



సినిమాల్లోకి వచ్చే హీరో హీరోయిన్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేందుకు చిన్న చిన్న సర్జరీలు చేసుకోవడం ఎప్పట్నుంచో ఉన్నదే. కొందరు ఈ విషయంలో ఓపెన్‌గా నిజాలు చెబుతారు. కొందరు దాపరికం పాటిస్తారు. కానీ కెరీర్ ఆరంభమైనపుడు.. తర్వాత లుక్స్ చూస్తే మార్పు స్పష్టంగా తెలిసిపోతుంది. బాలీవుడ్ హీరోయిన్లలో ముఖం మీద కత్తి గాటు పడని తక్కువమందే అని చెప్పాలి. ఇలాంటి సర్జరీలు చేయించుకుని అందాన్ని దెబ్బ తీసుకున్న వాళ్లు కూడా ఉన్నారు.


సౌత్ నుంచి వెళ్లి బాలీవుడ్‌లో కూడా సినిమాలు చేసిన శ్రుతి హాసన్ సైతం కెరీర్ ఆరంభంలోనే కాస్మొటిక్ సర్జరీ చేయించుకుంది. కెరీర్ మొదట్లో చేసిన లక్, అనగనగా ఒక ధీరుడు చిత్రాలతో పోలిస్తే తన లుక్‌లో మార్పు స్పష్టంగా గమనించవచ్చు. ఐతే తాను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్న విషయాన్ని శ్రుతి ఏమీ దాచిపెట్టలేదు. కానీ నిజం బయటపెట్టినందుకు తాను తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చిందని, జనం దారుణమైన మాటలు అన్నారని ఒక ఇంటర్వ్యూలో శ్రుతి వాపోయింది.



"నేను కాస్మొటిక్ సర్జరీ చేయించుకున్న విషక్ష్ని దాచిపెట్టలేదు. దాని గురించి ఓపెన్‌గానే చాలాసార్లు మాట్లాడాను. కానీ దీని మీద చాలామంది నెగెటివ్ కామెంట్లు చేశారు. ఈమె ప్లాస్టిక్ సర్జరీల దుకాణం.. అంటూ విమర్శలు చేశారు. నిజాయితీగా ఉన్నందుకు నేను చెల్లించిన మూల్యం అది. కానీ ఏం చేశానో.. ఎలా చేశానో నాకు మాత్రమే తెలుసు.

మనం మన పనిలో అయినా.. వ్యక్తిగత జీవితంలో అయినా.. ప్రేమలో ఉన్నపుడైనా నిజం మాట్లాడితే వేలెత్తి చూపేవాళ్లే ఎక్కువగా ఉ:టారు. అయినా ఎవరు ఏమనుకుంటారో అని పట్టించుకోకుండా నేను నాలా ఉండడానికే ప్రయత్నిస్తా" అని శ్రుతి చెప్పింది. తాను సౌత్ సినిమాలతో పాటు బాలీవుడ్‌లోనూ నటించానని.. కానీ సౌత్‌లో స్టార్లు చాలా వినయంగా, గౌరవభావంతో ఉంటారని.. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తారని.. వాళ్ల లైఫ్ స్టైల్ కూడా సింపుల్‌గా ఉంటుందని శ్రుతి అభిప్రాయపడింది.

# బాబి మద్యం మానేయకపోతే..!





అలవాట్లు సరిగా లేకపోతే, క్రమశిక్షణ అనేదే లేకపోతే పరిశ్రమ అస్సలు సహించదు. అలాంటి వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వరు. అది పరిశ్రమ వ్యక్తుల స్వభావం. ఈ విషయాన్ని గ్రహించలేక చతికిలబడ్డాడు బాబి అలియాస్ బాబి డియోల్. ధర్మేంద్ర వారసుడిగా అతడు పెద్ద స్థాయికి ఎదగాల్సినవాడు. కానీ అలవాట్ల కారణంగా, క్రమశిక్షణా రాహిత్యం కారణంగా, విజయాలు అందుకోలేక అతడు రేసులో వెనకబడ్డాడు.

దశాబ్ధం పైగా అతడు పూర్తిగా ఇంటికే పరిమితమయ్యాడు. అదే సమయంలో మత్తుకు బానిసయ్యాడు. ఆల్కహాలిక్ గా మారాడు. ఇంట్లో భార్య ఇచ్చే డబ్బులతో జీవించానని తెలిపాడు. ఇటీవల అతడు తన తప్పులన్నిటినీ ఒప్పుకుంటున్నాడు. ఇప్పుడు కూడా తాను ఆల్కహాల్ మానేశాక సంబంధాలు మెరుగయ్యాయని అంగీకరించాడు. తన అలవాట్లలో వచ్చిన మార్పు ఈ మేలు చేసిందని అన్నాడు. ఇటీవల మద్యం మానేయడం జీవితాన్ని మార్చేసిందని అన్నాడు. కొందరికి బానిసయ్యే స్వభావం జన్యువుల్లోనే ఉంటుందని కూడా బాబి అన్నాడు. నేను తాగుడు మానేసాక మంచి వాడిని అయ్యాను. ప్రతి ఒక్కరితో నాకు సంబంధాలు మెరుగయ్యాయి అని తెలిపాడు.

అలాగే బాబికి యానిమల్ పునర్జన్మనివ్వగా, ఇటీవలే ఆర్యన్ ఖాన్ తెరకెక్కించిన %-%ది బాలిలిలిడ్స్ ఆఫ్ బాలీవుడ్%-% నటుడిగా మంచి పేరు తెచ్చింది. ఈ సిరీస్ మేకింగ్ విషయంలో ఆర్యన్ ఖాన్ పనితనంపై బాబి ప్రశంసలు కురిపించాడు. అతడి తండ్రి సూపర్ స్టార్ అయినా కానీ, ఆ నీడ పడకుండా తనను తాను ప్రత్యేకంగా ఆవిష్కరించుకోవడానికి సాహసం చేసాడని ఆర్యన్ ని ప్రశంసించాడు. ఆర్యన్ ధైర్యానికి హ్యాట్సాఫ్ చెప్పాడు.

బాబి తదుపరి కొన్ని వరుస చిత్రాలతో బిజీగా ఉన్నాడు. సందీప్ వంగా %-%యానిమల్ పార్క్%-% చిత్రంలోను నటించాల్సి ఉంది. ఇటీవల తెలుగు, తమిళ చిత్రాలకు బాబి అధిక ప్రాధాన్యతను ఇస్తున్న సంగతి తెలిసిందే.